RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 11 నవంబర్ 2025 మంగళవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:136

# దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



స్వతంత్ర భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు.

దేశ తొలి విద్యా శాఖ మంత్రి శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం &మైనారిటీ సంక్షేమ దినోత్సవం ) సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణ తో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి రోజును (నవంబరు 11వ తేదీ) జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

మౌలానా ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా ( Advanced Technology Centers - ATCs) అప్ గ్రేడ్ చేశామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని సీఎం తెలిపారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకముగా పోరాడారని, జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించారని సీఎం గుర్తు చేసారు. స్వాతంత్ర అనంతరం మైనారిటీలకు గొంతు కగా నిలిచారని, ఆజాద్ జయంతిని మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటునాన్నమని,ప్రజా ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు.మైనార్టీల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నూతనంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' 'రేవంతన్నా కా సహారా' కింద ఫకీర్, పథకాలు ప్రారంభించి నిధులు కేటాయించడం జరిగిందన్నారు.

## అందెశ్రీ కన్నుమూత



హైదరాబాద్, నవంబర్ 10, ప్రముఖ రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. లాలాగూడలో ఇంట్లో అకస్మాత్తుగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అందెశ్రీ జనగాం దగ్గరున్న రేబర్తి అనే గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ గీతం రచించారు. ఈ ఏడాది జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కోటిరూపాయల నగదు పురస్కారం అందుకున్నారు

## అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

హైదరాబాద్ప్రజలు సందర్శనార్థం అందెశ్రీ పార్థివ దేహాన్ని జయశంకర్ స్టేడియంలో ఉంచారు.ఈ క్రమంలోనే అందెశ్రీకి కడసారి నివాళులర్పించేందుకు పలువురు ప్రముఖులు, నేతలు లాలాపేటలోనీ స్టేడియం కి తండోపతండాలుగా తరలివచ్చారు. ఇప్పటికే అందెశ్రీ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. దీంతో ఘట్కేసర్ లో అందెశ్రీ అంతిమ సంస్కారాలు జరగనున్నట్లుగా సమాచారం.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల బాధ్యతల స్వీకరణ

కుటుంబ సభ్యులతో కలిసి సచివాలయానికి రాక

ముస్లిం మత పెద్దల ప్రార్థనల అనంతరం ఛాంబర్‌లో బాధ్యతల స్వీకారం

టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయిం చిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు.

ఈ సందర్భంగా మంత్రి అజా రుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు. తాజాగా ఆయన ఈ శాఖల బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.





# పోలీసు అధికారులకు

## కంప్లైంట్ ఇచ్చినా పట్టించుకోవడం లేదు.



మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం.

**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )**ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.

జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తూ లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లు పంపిణీ చేస్తోంది.

అన్ని వీడియో, ఫోటో ఆధారాలతో సహా ఎలక్షన్ కమిషన్ కి సమర్పించడం జరిగింది.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ ని కోరాం.

కొంతమంది పోలీస్ అధికారులు, ఇతర అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారు.

సీ విజిల్ యాప్ లో కంప్లైంట్ కూడా ఇస్తున్నాము.

పోలీసు అధికారులకు కంప్లైంట్ ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు. తగిన రీతిలో కాంగ్రెస్కు బుద్ధి చెబుతారు.

ఇంత అధికార దుర్వినియోగం జరుగుతున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదు.

అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొని వచ్చాము.

సెన్సిటివ్ పోలింగ్ బూతుల్లో కేంద్ర బలగాలను పెట్టాలని, సెన్సిటివ్ బూత్ వివరాలను కమిషన్ కి సమర్పించాము.

ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులను, ఆశా, అంగన్వాడి వర్కర్లను అక్కడ నియమించి లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీ గుర్తించిన తర్వాతనే పోలింగ్ బూత్ లోకి అనుమతించాలని కోరాము.

ఓటర్ ఐడి గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూతులకు పంపించకూడదు.

మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి.

ముఖ్యంగా ఫేక్ ఓటర్ ఐడీలు తయారు చేశారు.

ఫేక్ ఐడి కార్డుల వీడియోను ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించడం జరిగింది.

ఎలక్షన్ అబ్జర్వర్లకు కూడా కాంగ్రెస్ అధికార దుర్వినియోగము, ఫేక్ ఐడీ కార్డుల వివరాలను అందించాము.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తప్పకుండా అధికారులపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

యూసుఫ్ గూడాలో కాంగ్రెస్ కార్యాలయమును ఆనుకొని పోలింగ్ బూత్ ఉంది.

కాంగ్రెస్ కార్యాలయం పక్కన పోలింగ్ బూత్ ఎలా పెడతారు. దీనికి సంబంధించి కూడా ఆధారాలను ఎన్నికల కమిషన్కు ఇచ్చాం.

ముఖ్యమంత్రి రెండు సంవత్సరాలుగా ఆరు గ్యారెంటీలపై రివ్యూ పెట్టడానికి టైం దొరకలేదు. ఈరోజు 6 గ్యారంటీలపై రివ్యూ పెట్టడం ఎందుకు?

మొదటి అసెంబ్లీలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు.



ఎన్నిసార్లు క్యాబినెట్ సమావేశం జరిగింది. అసెంబ్లీ జరిగింది. అయినా ఆరు గ్యారంటీలపై ఏనాడు రివ్యూ చేయలేదు.

జూబ్లీహిల్స్ లో ఓటమి భయంతో ముఖ్యమంత్రి మోకాళ్లపై తిరుగుతున్నాడు.

ఈరోజు ఆరు గ్యారెంటీలపై ముఖ్యమంత్రి రివ్యూ చేయడం జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేయడమే.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివాలాకోరు రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు అర్థమైంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ముందే నిర్ణయించుకున్నారు.

ప్రజాబలం

11 నవంబర్ 2025 మంగళవారం

# చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై.. వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది. పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమతి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితంలో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. అత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

# రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

## రాష్ట్ర పౌర సరఫరాలు,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 10 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకున్న పత్తి,వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాలు,నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు,వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇందులో భాగంగా రైతులు సాగుచేసిన పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.పత్తి,వరి కొనుగోలు ప్రక్రియ రాష్ట్రంలో సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని, సరిహద్దుల వద్ద అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. 2025%-%26 ఖరీఫ్ సీజన్ పంటలైనవరి,మక్కజొన్న, పత్తి కొనుగోలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చే సమయంలో పాటించవలసిన నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతుల వివరాలు స్పష్టంగా ట్యాబ్ లలో నమోదు చేసి చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 450 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని,ఇందులో 6 వేల 838 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించామని, ఇంకా 1 వేయి 614 కేంద్రాలు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు.అధికారుల సూచనల ప్రకారం నవంబర్ 3,4 వారాలు కీలక సమయంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందుగా పంటల కొనుగోలుకు సంబంధించి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అధికారులు వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ,కొనుగోలు ప్రక్రియ వేగంగా చేయాలని,రైతులకు చెల్లింపులు త్వరితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీల లభ్యత,రవాణా సమస్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, తేమ శాతం నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, పంటలను సమయానికి కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని,సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తుందని, కౌలుదారు రైతుల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలులో రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97,డి.సి.ఎం.ఎస్. ఆధ్వర్యంలో 63,మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీస్,రెవెన్యూ,వ్యవసాయ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టెక్నో-కల్చరల్ ఫెస్టివల్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### 55 లక్షల రూ. నిధులు మంజూరు

### హైదరాబాద్ వేదికగా 'కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా' ఉత్సవం

### తెలంగాణను కళలకు నిలయంగా..సినిమా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం ౹ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణనార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో కల్చరల్ ఫెస్టివల్ కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా" అనే విభిన్న సాంస్కృతిక సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ. 55 లక్షల నిధులను మంజూరు చేసిందనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



జి.ఓ.ఆర్.టి.నెం.1551 ప్రకారం, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (TGFDC) ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్ మరియు హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర సినీ సాంస్కృతిక రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే దిశగా ముందడుగు వేస్తోంది.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...

"తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయి," అన్నారు.ఈ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కి కేంద్ర బిందువుగా ఎదుగుతున్నదని తెలిపారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను మెట్రో మార్గంతో అనుసంధానం

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ నవంబర్ 10 ప్రజాబలం ప్రతినిధి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నాం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. . సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు వేగంగా సాగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పనులు చేయాల్సి వస్తోందని అన్నారు రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు నిత్యం 1.97 లక్షల ప్రయాణికులు వస్తుంటారని తెలియజేశారు. శంషాబాద్ విమానాశ్రయం వలే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను తీర్చిదిద్దాలనేది తన ఆంకాంక్ష అని.. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని, 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను 1.65 లక్షల చ.మీ. మేర కొత్తగా నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబర్ లోపు ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# జనంలోనే జగన్



విజయవాడ, నవంబర్ 10, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు మంచి స్పందన లభిస్తుండటంతో ఇక ప్రజల్లో ఉండాలని జగన్ ను నేతలు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికలు జరిగి రెండేళ్లు కావస్తుండటంతో వైసీపీకి హనీమూన్ పీరియడ్ ముగిసిందంటున్నారు. ఇప్పుడు కూడా అడపా దడపా వచ్చి ప్రజలను కలుసుకోవడం బాగా లేదని కొందరు వైసీపీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. బెంగళూరు నుంచి మకాం మార్చేసి జగన్ తాడేపల్లిలోనే ఉంటూ నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రస్తుతం పాజిటివ్ వేవ్ ఉన్న కారణంగా జగన్ దానిని చెడగొట్టుకునే ప్రయత్నం చేయవద్దని కూడా సూచిస్తున్నారు.మరొకవైపు త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు దూరంగా వైసీపీ ఉంటుందన్న ప్రచారాన్ని పార్టీ నేతలు ఖండిస్తున్నారు. గెలిచినా, ఓటమి పాలయినా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉంటామని చెబుతున్నారు. పోటీ లేకుండా చేసి ఎన్నికలను ఏకగ్రీవం చేయడం వల్ల టీడీపీకి అదనపు బలం తమకు తామే సమకూర్చినట్లవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపి తాడోపేడో తేల్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. లేకుంటే ద్వితీయ శ్రేణి నేతలు నీరుగారిపోతారని, క్యాడర్ కూడా పార్టీకి దూరమవుతుందన్న భావనలో జగన్ ఉన్నారు. అందుకోసమే ఇక జనంలోనే ఉండాలని జగన్ కూడా భావిస్తున్నారు.. సమస్యల వారీగా జిల్లాల పర్యటన చేయాలని ఆయన భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదో ఒక సమస్య మీద ప్రతి జిల్లాలో నెలకు రెండు రోజుల పాటు టూర్ చేయాలన్న ప్లాన్ లో జగన్ ఉన్నారని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు జనవరి నెలలో జరిగే అవకాశముండటంతో అందుకు రెండు, మూడు నెలల కూడా సమయం లేకపోవడంతో ఇక జిల్లాల పర్యటనకు జగన్ రెడీ అవుతున్నారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈ పర్యటనలతో పార్టీలో హైప్ రావడమే కాకుండా జనంలో కూడా జగన్ ఉన్నారన్న సంకేతాలు వెళతాయని, అధికార పార్టీ అక్రమ అరెస్ట్ లు కూడా ఎండగట్టే అవకాశముంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. టూర్ షెడ్యూల్ ను సిద్ధం చేయాలని పార్టీ నేతలను జగన్ కోరినట్లు తెలిసింది. ఇక 2027లో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయడానికి కూడా సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయన ముందుగా జిల్లాలు తిరిగి క్యాడర్ ను, లీడర్లను మోటివేట్ చేయనున్నారని తెలిసింది.

# మంది ఎమ్మెల్యేలకు నోటీసులు



విజయవాడ, నవంబర్ 10, టీడీపీ ఎమ్మెల్యేల్లో 48 మంది పూర్తిగా దారి తప్పారని చంద్రబాబునాయుడు గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పిన వికపోవడంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, ప్రవర్తనలో లోపాలు ఉన్న 48 మంది ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన సీఎం, పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యేలు ఎంత మంది అందుబాటులో ఉంటున్నారో తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాల పరిమితి తీరిపోయే వరకూ పంపిణీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసే కార్యక్రమాల్లో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం సీఎం దృష్టికి వచ్చింది. బ్యాక్ ఆఫీసు, ప్రోగ్రాం కమిటీకి ఆదేశాలు జారీ చేస్తూ, ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సూచించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలకు ఇన్సూరెన్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలి. పనిచేసిన వారందర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాల్లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. పాల్గొనకపోతే పార్టీ కేంద్ర కార్యాలయం వివరణ తీసుకోవాలి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు గతంలో కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు ఎన్నోకష్టాల్లో ఉంటే సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటారు. వారికి మంజూరు అయిన డబ్బులు కూడా ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు తీరిక లేకపోతే ఇక వారికి ప్రజా సేవ చేయడానికి అర్హత ఏముంటుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. సీఎం ఆర్ఎఫ్ చెక్కులకు మూడు నెలల పరిమితి ఉంటుంది. ఇష్యూ చేసిన తేదీ నుంచి మూడు నెలల పాటు చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల అవి తిరిగి వస్తున్నాయి . కొత్తగా చెక్కులు జారీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సీఎంను అసహనానికి గురి చేసింది. ఇప్పటి వరకూ చూశామని ఇక పనితీరు మార్చుకోకపోతే పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

కొలిక్కి తిరువూరు వివాదం...

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఓపెన్ గానే విమర్శలు గుప్పించుకున్నారు. ఇరువురు నేతలు మీడియాకు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. వీరి మధ్య వివాదం టీడీపీలో పెను దుమారమే రేపింది. దీంతో సీఎం చంద్రబాబు ఫుల్ సీరియస్ అయ్యారు. వీరి వ్యవహారంపై ఆరా తీశారు. అసలేం జరిగిందో తెలుసుకోవాలని , దీనిపై తనకు పూర్తి నివేదిక సమర్పించాలని టీడీపీ క్రమశిక్షణ కమిటీని ఆదేశించారు చంద్రబాబు.ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగింది టీడీపీ క్రమశిక్షణ కమిటీ. వర్ల రామయ్య, కొనకళ్ల నారాయణ, పంచుమర్తి అనూరాధ నేతృత్వంలోని ఈ కమిటీ.. నేతల మధ్య వివాదంపై ఆరా తీసింది. ఇరువురి నుంచి వివరణ తీసుకుంది. తిరువూరులో స్థానిక పరిస్థితులపైనా ఆరా తీశారు. ఈ అంశంపై నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఆ నివేదికలో ఏముంది? అనేది ఉత్కంఠగా మారింది. నివేదిక పరిశీలించిన తర్వాత సీఎం చంద్రబాబు నిర్ణయం ఏ విధంగా ఉండనుంది, ఎవరిపైన చర్యలు ఉంటాయి అనేది పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.కాగా, తిరువూరు ఎమ్మెల్యే టికెట్ కోసం ఎంపీ కేశినేని చిన్ని 5 కోట్లు తీసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి ఘాటుగానే బదులిచ్చారు కేశినేని శివనాథ్. వైసీపీ కోవర్ట్ అంటూ కొలికపూడిపై ఎదురుదాడికి దిగారాయన.

# ఆగని రజనీ రచ్చ

గుంటూరు, నవంబర్ 10, పల్నాడు జిల్లాలో మాజీ మంత్రి విడదల రజని పోలీసులపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత రెండు రోజులుగా తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అన్యాయమని, ఇది చట్ట వ్యవస్థను అవమానించే పని అని ఆమె మండిపడ్డారు. చట్టానికి, వ్యవస్థలకు తమకు సంపూర్ణ గౌరవం ఉన్నప్పటికీ, పోలీసుల ప్రవర్తన మాత్రం రౌడీలు, గూండాలను తలపిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడుతున్నారు రజినీ. వైసీపీ మాజీ మంత్రి విడదల రజని తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడుతున్నారు. తనపై నమోదవుతున్న కేసుల నేపథ్యాన్ని వివరించిన రజని, శ్రీ గణేష్ చౌదరి పేరుతో జరుగుతున్న ఫిర్యాదులు పూర్తిగా రాజకీయ నాటకమని అన్నారు. గణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పాల్గొన్నాడని, ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినవాళ్లే ముందే పేర్కొన్నారని ఆమె చెప్పారు. ఈ ఏడాది మార్చిలో దర్శిలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కూడా గణేష్ టీడీపీ అనుచరుడని స్పష్టమైన పత్రాలలో ఉందని రజని వెల్లడించారు. వదేళ్ల క్రితం తీసుకున్నట్లు చెప్పిన 35 లక్షల రూపాయల వ్యవహారాన్ని ఇప్పుడు తనపై తప్పుడు కేసులుగా మలచడానికి ప్రయత్నించడం ఎంతో విచారకరమని ఆమె అన్నారు. మాబు సుభాని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని ఆరోపణ:. మాబు సుభాని అనే వ్యక్తి పల్నాడు ఎస్పీ కార్యాలయంలో తమపై ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఆమె, అతను టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని, అంతకుముందు చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో గణేష్‌తో రాజీకి వచ్చిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలను పట్టించుకోకుండా, ఒకవైపు ఫిర్యాదు పెట్టేలా, మరోవైపు కేసులు నమోదు చేసేలా పోలీసులు పనిచేస్తున్నారని రాజినిలు విమర్శించారు. పల్నాడు జిల్లాలో ఒక ఉన్నతాధికారి ఓ ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే వెంటనే కేసులు పెట్టడం, యూనిఫామ్ వేసుకున్న పోలీసులు మూడు పార్టీలకే అనుకూలంగా పని చేయడం వంటి వ్యవహారాలు చట్టవిరుద్ధమైన విధ్వంసానికి నిదర్శనమని ఆమె అన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి రజినీ:. తన వ్యక్తిత్వ హననానికి డీఎస్పీ నేరుగా పాల్పడ్డారని, దీనిపై పరువు నష్టం దావా వేయడమే కాక హ్యూమన్ రైట్స్ కమిషన్, మహిళా కమిషన్‌లను ఆశ్రయిస్తానని రజని ప్రకటించారు. రాజకీయంగా ఒక మహిళ ఎదగడం కొందరికి నచ్చడం లేదని, అందుకే తమ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు.. టీడీపీ వాళ్లే ఫిర్యాదు చేసి, వాళ్ల ప్రభుత్వమే కేసులు పెట్టేలా చూస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ఎస్సీ, ఎస్టీతో సహా ఏడు కేసులు నమోదు చేసినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, న్యాయం తనవైపునే ఉందని ఆమె తెలిపారు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరగాలని ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు రజని వెల్లడించారు.

# ఎన్ హెచ్ 65 గేమ్ ఛేంజర్ కాబోతోందా

విజయవాడ, నవంబర్ 10, ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపించటం, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వంటి కారణాలతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. మరోవైపు విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో విజయవాడ శివారు ప్రాంతమైన ఉయ్యూరు వంటి చోట్ల భూములకు డిమాండ్ పెరుగుతోందని.. రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి జాతీయ రహదారి విస్తరణ గేమ్ ఛేంజర్ అవుతుందని అంచనా వేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో అనేక మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారులో టీడీపీ, జనసేన పార్టీలు కీలక భాగస్వామ్యులుగా ఉండటంతో రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన మద్దతు లభిస్తోంది. మరోవైపు మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంతో ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటూ ఉండటంతో .. ఆయా ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ వస్తోంది. తాజాగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -65) విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా రూపొందించింది.అయితే విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు పట్టాలెక్కితే విజయవాడ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఉయ్యూరు లాంటి ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ పుంజుకోవడానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందని చెప్తున్నారు. పరిశ్రమలు విస్తరించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ఈ ప్రాంతంలో ఆస్తి విలువలు పెరుగుతాయని, ఇళ్లకు డిమాండ్ ఏర్పడుతుందని.. అలాగే ఈ ప్రాంత జీవనశైలిలోనూ మార్పులు వచ్చే అవకాశాలు ఉండొచ్చంటున్నారు.ప్రస్తుతం విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి -65 ముఖ్యమైన మార్గంగా ఉంది. విజయవాడను పోర్టు సిటీ అయిన మచిలీపట్నంతో కలిపే రహదారి ఇదే. అయితే పారిశ్రామిక, లాజిస్టిక్స్, వాణిజ్యం పెరిగే కొద్దీ. ఈ రహదారిపై వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఉండవని, ప్రయాణం మరింత వేగంగా, సౌకర్యవంతంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే ఈ కారిడార్ వెంబడి ఖరీదైన విల్లాలు, కమర్షియల్ హబ్స్, నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.దీంతో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఉయ్యూరు వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో భూములకు మంచి డిమాండ్ ఏర్పడుతుందని చెప్తున్నారు.

# రాళ్లవాగులో వజ్రాల వేట

కర్నూలు, నవంబర్ 10, వర్షాకాలం ప్రారంభం అయితే చాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలి వస్తుంటారు. రోజుల తరబడి పొలాల్లో కూర్చుని వజ్రాల కోసం గాలిస్తుంటారు. ప్రతి సంవత్సరం కొందరికైనా వజ్రాలు దక్కుతాయి. దక్కని వారు.. వచ్చే సంవత్సరం చూసుకుందాం అని వెళ్లిపోతారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో ప్రాంతం చేరింది. అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో.. జనాలు తండోపతండాలుగా అక్కడకు తరలి వస్తున్నారు. మరి నిజంగానే అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే..ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో పారే రాళ్లవాగు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం సాగుతుండటంతో.. రాళ్ల వాగు కాస్త వజ్రాల వాగుగా మారింది. మరి నిజంగానే ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే.. ఇప్పటి వరకు డైమండ్స్ దొరికిన వాళ్లు ఒక్కరు కూడా లేరు. కానీ సోషల్ మీడియాలో ప్రచారం చూసి స్థానిక ప్రాంత ప్రజలు, పేదలు, కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం రాళ్ల వాగు వద్దకు తరలి వస్తున్నారు. ఈ వాగులో వజ్రాల కోసం వేట కొనసాగుతుండటంతో రాళ్లవాగు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ రాళ్ల వాగు.. మహానంది మండలంలోని గాజులపల్లె గ్రామ సమీపంలో.. నల్లమల అడవిలో ఉన్న పురాతన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కింది భాగంలో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే ఈస్వామి వారి కళ్యాణం సందర్భంగా వజ్రాలతో తలంబ్రాలు పోశారని స్థానికులు నమ్ముతారు. ఈ వజ్రాలు కాస్త.. ఆలయం క్రింద భాగంలో ప్రవహించే రాళ్లవాగులో కలిశాని.. అవి ఇప్పుడు దొరికేందుకు అవకాశం ఉంది అంటున్నారు. అలానే ఈ రాళ్ల వాగును వజ్రాల వాగుగా పిలుస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ వాగులో వజ్రాలు లభ్యమవుతున్నాయనే ప్రచారం ఉండేది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వజ్రాల వేట కోసం వస్తుంటారు.. ఈ ప్రాంతంలో వజ్రాల కోసం వెతుకుతున్నారు. అయితే ఎవరికి ఏ వజ్రం దొరకలేదని చెబుతున్నారు. కేవలం సుద్దరాళ్లు మాత్రమే లభిస్తున్నాయని తెలుస్తోంది.

ఈ ప్రాంతం.. గాజులపల్లె రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఎవరికైనా వజ్రం దొరికిందని అనుమానం కలిగితే.. దానిని పరీక్షించేందుకు అక్కడే కొందరు వ్యక్తులు పరికరాలతో పరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఒక్క రాయి పరీక్షించేందుకు 10 రూపాయలు తీసుకుంటే, ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ఇక్కడ వజ్రాలు అయితే దొరకడం లేదు కానీ.. హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్ క్రీములు అమ్మే బండ్లకు మాత్రం మంచి వ్యాపారం జరుగుతోంది.

# పర్యాటకం కోసం హోమ్ స్టే...

తిరుపతి, నవంబర్ 10, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హోమ్‌స్టే విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు.. పర్యాటకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా బెజ్జాపికులు హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హోమ్ స్టే ఏర్పాటు చేయడానికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా అనేక చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో.. సామాన్య పర్యాటకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం హోమ్‌స్టే విధానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. స్థానికులతో కలిసి సొంతింట్లో ఉన్న అనుభూతిని పర్యాటకులకు కల్పించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం అమలులో భాగంగా బెజ్జాపికులు హోమ్ స్టేలను ఏర్పాటు చేసుకునేలా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది.పర్యాటక శాఖ మార్గదర్శకాల ప్రకారం.. హోమ్ స్టే ఏర్పాటు చేయాలనుకునే ఇంటి యజమానులు.. అక్కడే నివాసం ఉండాలి. వారు.. తమ ఇంట్లో కనీసం ఒకటి.. గరిష్ఠంగా ఆరు గదులను పర్యాటకులకు అద్దెకు ఇవ్వొచ్చు. ఇంట్లో కనీస వసతులు.. సురక్షిత మంచినీరు వంటివి అందుబాటులో ఉండాలి. శుభ్రమైన పరిసరాలు, టాయిలెట్లు ఉండాలి. ఏసీ, టీవీ, ఇంటర్నెట్, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు పార్కింగ్ ప్రదేశం కూడా ఉండాలి. హోమ్ స్టేలకు వచ్చిన పర్యాటకుల వివరాలు (గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్) నమోదు చేసుకోవాలి. అవసరమైనప్పుడు అధికారులు తనిఖీలు చేసేందుకు వీలుగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. ఈ నేపథ్యంలో హోమ్‌స్టే విధానానికి త్వరితగతిన అనుమతులు లభించే అవకాశం ఉంది. ఆసక్తిగల ఇంటి ఓనర్లు దరఖాస్తు చేసుకునే సమయంలో.. గుర్తింపు, చిరునామా, ఆస్తి యాజమాన్య పత్రాలు, స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తదితర వివరాలు సమర్పించాలి. ఈ మేరకు సంబంధిత (ప్రోవిజన్‌బీఏ.బీజీజీతినిజ.జీజా. జనీల.తిని) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

స్థానిక పర్యాటక శాఖ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు.దరఖాస్తు తర్వాత ఆంధ్రప్రదేశ్ టూరిజం అధికారులు ఇంటిని తనిఖీ చేస్తారు. అనంతరం అప్రూవల్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ తర్వాత లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్స్ వచ్చిన తర్వాత.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం వసతులు కల్పించాలి. కాగా, అరకు, విశాఖపట్నం, కోనసీమ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో.. గిరిజన, వారసత్వ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హోం స్టేలను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో ఇప్పటికే దాదాపు 30 పర్యాటక కేంద్రాలను అధికారులు గుర్తించారు. అందులో అమరావతి ఆలయం, బౌద్ధ స్తూపం, కొండవీడు, కోటప్పకొండ, నాగార్జునకొండ, సత్రశాల, దైద, ఎత్తిపోతల తదితర ప్రాంతాలు ఇన్నాయి

# జనసేన సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్

గుంటూరు, నవంబర్ 10, రాజకీయ పార్టీలకు, ప్రముఖులకు సంబంధించిన ట్విట్టర్ ఖాతాలు, ఫేస్‌బుక్ అకౌంట్లు పలు సందర్భాల్లో హ్యాకింగ్‌కు గురవుతున్న విషయం తెలిసిందే. బాధితుల్లో అనేక మంది సెలబ్రిటీలు కూడా ఉన్నారు. అయితే, తాజాగా.. జనసేన పార్టీ ట్విట్టర్ అకౌంట్ హ్యాకర్ల బారినపడింది. ఎప్పుడూ జనసేన పార్టీకి సంబంధించిన, పవన్ కల్యాణ్ ప్రోగ్రాంలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కనిపించే ఈ ట్విటర్ ఖాతాలో.. ఇన్వెస్ట్‌మెంట్స్, ట్రేడింగ్స్‌కు సంబంధించిన రీ ట్వీట్లు కనిపించడంతో ఫాలోవర్లు అవాక్కయ్యారు.జనసేన పార్టీ అధికారిక ఎక్స్ (గతంలో ట్విటర్) హ్యాండిల్ హ్యాకింగ్‌కు గురైంది. ఈ ఘటన వెలుగులోకి రాగానే పార్టీ నాయకత్వం అప్రమత్తమైంది. సైబర్ క్రైం అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఖాతా పునరుద్ధరణ కోసం సాంకేతిక బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జనసేన పార్టీ ట్విట్టర్ ఖాతా సైబర్ నేరగాళ్ల ఆధీనంలోనే ఉంది.నిత్యం పొలిటికల్ పోస్టులు కనిపించే జనసేన హ్యాండిల్లో హ్యాకింగ్‌కు గురైన తర్వాత ఇన్వెస్ట్ మెంట్స్, ట్రేడింగ్స్ సంబంధించిన రీ ట్వీట్ చేసిన పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఇది చూసిన పార్టీ అభిమానులు, శ్రేణులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఈ హ్యాకింగ్ ఘటనపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలాఉంటే.. గత ఏడాది ఎన్నికల సమయంలోనూ జనసేన పార్టీకి సంబంధించిన అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాకింగ్ విషయం తెలిసిందే. ఆ సమయంలో పార్టీకి సంబంధించిన వీడియోలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభలు, సమావేశాలు ఉండటంతో పార్టీ యూట్యూబ్ ఛానల్ ఫుల్ యాక్టివ్ గా ఉన్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఆ యూట్యూబ్ ఛానల్ లో జనసేన పార్టీకి చెందిన వీడియోలను తొలగించిన హ్యాకర్లు.. బిట్ కాయిన్ వీడియోలు అప్లోడ్ చేశారు. జనసేన యూట్యూబ్ ఛానల్ పేరు తొలగించి.. మైక్రో స్ట్రాటజీ అని పేరు మార్చేశారు. తాజాగా.. ఇప్పుడు జనసేన ట్విట్టర్ ఖాతా హాక్ కావడం చర్చనీయాంశంగా మారింది.

# టచ్ స్క్రీన్ ద్వారా దర్శనం టికెట్లు

కర్నూలు, నవంబర్ 10, ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయాల్లో వంద కియోస్క్ లు ఏర్పాటు చేయనున్నారు. టచ్ స్క్రీన్ ఉండే వీటి ద్వారా భక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందొచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదు చేసి.. డిజిటల్ చెల్లింపు చేస్తే వెంటనే టికెట్లు జారీ చేస్తుంది.కరూర్ వైశ్యా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కియోస్క్ మెషిన్లను ఉచితంగా అందిస్తోంది. ఈ కొత్త కియోస్క్‌లు భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. ఇకపై క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమకు కావాల్సిన దర్శనం, సేవల టికెట్లను నేరుగా ఈ స్క్రీన్ కియోస్క్ మెషిన్‌ల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఉద్యోగులు అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలు కల్పిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఆలయాల నిర్వహణపై భారం తగ్గుతుంది. అయితే, వాటి ఇన్ స్టలేషన్, నిర్వహణ బాధ్యతలను కరూర్ వైశ్యా బ్యాంకు చూసుకోనుంది.ఏపీలోని ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గమ్మ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో ఎనిమిది చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ముఖ్య ఆలయాలైన అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, తలుపులమ్మ, వాడపల్లి, పెనుగంచిప్రోలు, మోపిదేవి, పెదకాకాని, పెంచలకోన, తలకోన, ఈరన్నస్వామి, మహానంది, బేతంచెర్ల మద్దిలేటి నరసింహస్వామి, కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాల్లో మూడేసి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేయనున్నారు.తిరుమలలో ఇప్పటికే కియోస్క్ మెషిన్లను ఉపయోగిస్తున్నారు. అన్నప్రసాద వితరణ కేంద్రంలో భక్తులు విరాళాలు అందజేసేందుకు ఈ కియోస్క్ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లడ్డూ విక్రయాల కోసం కూడా కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్యమైన ఆలయాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# సీఐఐ సదస్సుకు 40 కోట్లు

విశాఖపట్టణం, నవంబర్ 10, ఏపీ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే విశాఖలో ఈ నెల 13, 14 జరగనున్న ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 40 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు రానుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సులో సుమారు 10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు 40 కోట్ల రూపాయలతో విశాఖను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ సిద్ధమవుతోంది. ప్రపంచ స్థాయి వసతులతో అతిథులకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఏర్పాట్లలో ఎక్కడా రాజీ లేకుండా ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక సెక్యూరిటీతో పాటు సదస్సుకి హాజరయ్యే పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మరింత సమాచారం మా ప్రతినిధి శివశంకర్ అందిస్తారు. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు మరోవైపు విశాఖలోని ప్రధాన కూడళ్లను ప్రభుత్వం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న అద్భుత కళాఖండాలు, వాటర్ ఫౌంటెన్లు అబ్బుర పరుస్తున్నాయి. పెట్టుబడులకు ముఖద్వారం విశాఖనే అనేలా ముస్తాబు చేస్తున్నారు. రోడ్ డివైడర్లకు సైతం రంగులు అద్దుతున్నారు. మరింత సమాచారం మా ప్రతినిధి శివశంకర్ అందిస్తారు. వాల్‌పెయింటింగ్స్‌తో పాటు డివైడర్లకు కొత్త రంగులు ఇదిలా ఉంటే అవసరమైన చోట కొత్త రోడ్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది.

ఎక్కడికక్కడ వేస్తున్న వాల్ పెయింటింగ్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉండే గోడలన్నీ కొత్త రంగలతో మెరిసిపోతున్నాయి. అలాగే పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా చేస్తున్న ఏర్పాట్లలో పచ్చదనానికి కూడా అధికారులు పెద్ద పీట వేస్తున్నారు. అందం, ఆహ్లాదం కలగలిపి విశాఖను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు

# బీహార్ లో పోటెత్తిన మహిళలు

హైదరాబాద్, నవంబర్ 10, బిహార్ తొలి విడత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు అపూర్వ ఉత్సాహం కనబరిచారు. మొత్తం 18 జిల్లాల్లోని 121 స్థానాలకు జరిగిన పోలింగ్‌లో 64.69 శాతం ఓటింగ్ నమోదై రాష్ట్ర రాజకీయ చరిత్రలో కొత్త రికార్డు నెలకొంది. పోలింగ్ పూర్తిగా శాంతియుత వాతావరణంలో జరగడం గమనార్హం. గతంలో జరిగిన అల్లర్లు, బూత్ క్యాప్చరింగ్ సంఘటనలు లేకుండా ఈసారి ఎన్నికలు సాఫీగా జరగడం ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.బిహార్ తొలి విడత ఎన్నికల్లో ముజఫర్‌నగర్‌లో అత్యధికంగా 71 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా పాట్నాలో 58 శాంత నమోదైంది. ఈసారి పోలింగ్ బిహార్ జనసామాన్యంలో రాజకీయ చైతన్యం పెరిగిందని సూచిస్తోంది. పట్నా వంటి పట్టణాల్లో కూడా మంచి ప్రతిస్పందన రావడం ఈసారి సామాన్య ప్రజల పాలిట ఎన్నికలు ముఖ్యమయ్యాయని సూచిస్తుందిఎన్నికల ముందు ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై పెద్ద ఎత్తున చర్చ, రచ్చ జరిగింది. ఓట్లు తొలగించారని కాంగ్రెస్ పెద్ద ఆందోళన చేసింది. రాహుల్‌గాంధీ ఓట్‌చోరీ పేరిట యాత్ర చేశారు. కానీ వీటి ప్రభావం ఏదీ పోలింగ్‌పై పడలేదు. పోలింగ్ అనంతరం గణనీయమైన ఫిర్యాదులు లేకపోవటం ప్రజలు ఆ ప్రక్రియను అంగీకరించినట్లుగా అర్థం చేసుకోవచ్చు.ఇక బిహార్‌లో ఒక సుదీర్ఘ సెంటిమెంట్ ఉంది. పోలింగ్ శాతం 60 దాటితే లాలూ యాదవ్ విజయం సాధించారని, తక్కువైతే నితీశ్‌కుమార్ విజయం సాధించారని గత ఎన్నికల గణాంకాలు చెబుతున్నాయి. 1990, 1995, 2000 ఎన్నికల్లో 60 శాతం పైగా పోలింగ్ నమోదు కాగా, లాలూ గెలిచారు. 2005, 2010, 2017లో తక్కువ ఓటింగ్‌తో నితీశ్ విజయినయ్యారు. ఈసారి తిరిగి 64.69 శాతం పోలింగ్ నమోదవడంతో ఫలితాలపై ఉత్కంఠ పెరిగింది.గతంలో భద్రతా లోపాల కారణంగా బిహార్‌లో 5?6 విడతలుగా ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చేది. ఈసారి రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి విడత ప్రశాంతంగా పూర్తవ్వడం ప్రజల్లోని విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ఓటర్లకు భయంలేని వాతావరణం కల్పిస్తే ఎన్నికలలో పాల్గొనడం సహజమని ఈసారి బిహార్ నిరూపించింది.2014 తర్వాత బిహార్ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ క్రమంగా పెరుగుతోంది. 2015లో 60.48 శాతం మహిళలు ఓటేసి రికార్డు సృష్టించారు. 2020లో కూడా మహిళా పాల్గొనింపు పురుషుల కన్నా ఎక్కువ. నితీశ్ ప్రభుత్వం మహిళల సంక్షేమ కార్యక్రమాలు, భద్రతా చర్యలు, విద్యా ప్రోత్సాహ పథకాలు అమలు చేయడం ఈ పెరుగుదలకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇది నితీశ్ కూటమికి రాజకీయంగా బలాన్నిస్తుంది.ఈసారి పెద్ద ఎత్తున యువ ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. యువకులు ప్రధానమంత్రి మోదీ ఆకర్షణతోనా, లేక తేజశ్వి యాదవ్ లాంటి యంగ్ లీడర్ ప్రతిఛాయతోనా ఓటు వేశారన్నది ఫలితాల్లో తేలుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రచారంలో ఒక కొత్త శ్లోగన్ అందుకుంది.. "నమో" స్థానంలో "నిమో" (నితీశ్?మోదీ) నినాదం. ఈ వ్యూహం సీట్ల లెక్కలో ఎలా ఆడుతుందో, రెండో విడత ఓటింగ్ అనంతరం స్పష్టత రానుంది.నవంబర్ 11న రెండో విడత ఓటింగ్, 14న ఫలితాలు ప్రకటించనున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తుది ఫలితాల్లో ఎవరికి లాభించబోతుందో అనేది ఈసారి బిహార్ ఎన్నికలలో ప్రధాన ప్రశ్నగా మారింది.

# సిటీలో వీధికుక్కలపై గ్రేటర్ అధికారుల దృష్టి



హైదరాబాద్, నవంబర్ 10,సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు.. హైదరాబాద్‌లో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో నగరంలోని ఆసుపత్రుల పరిసరాల వద్ద ఈ కార్యక్రమం మొదలైంది. తొలి రోజునే 277 కుక్కలను పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్, టీకాలను ఇచ్చి.. జీహెచ్‌ఎంసీ సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనాలు ఎక్కుకవగా ఉండే ప్రాంతాల్లో ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కుక్కల దాడులు పెరగడంతో.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ చర్యలు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం విశేషం. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు.. వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ డ్రైవ్‌ను ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించి అమలు చేస్తున్నారు.ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైన తొలి రోజునే, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల చుట్టు పక్కల ఏరియాల్లో ఏకంగా 277 వీధి కుక్కలను విజయవంతంగా పట్టుకున్నారు. ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. ఈ ప్రాంతాలకు ముఖ్య ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతను, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రుల వద్ద కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రత లోపించడంతో పాటు.. రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు.పట్టుకున్న ఈ వీధి కుక్కలను కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం కాకుండా.. వాటి సంఖ్యను శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టుకున్న కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ లేదా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ పద్ధతిని యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అని కూడా అంటారు. దీనివల్ల వాటి సంఖ్య పెరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. తిరిగి.. వాటికి టీకాలు ఇచ్చి, కొద్ది రోజుల పర్యవేక్షణ తర్వాత మాత్రమే పట్టుకున్న ప్రాంతంలోనే సురక్షితంగా విడిచిపెడతారు.కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగర ప్రజలకు భరోసా ఇస్తూ.. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించామని తెలిపారు. తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు వంటి ముఖ్యమైన పబ్లిక్ ప్రదేశాలు.. అలాగే పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో కూడా ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఏబీసీ పద్ధతిని పకడ్బందీగా అమలు చేస్తూ.. హైదరాబాద్‌ను కుక్కల బెడద లేని నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# సైనిక విన్యాసాలతో వ్యూహాత్మక చర్యలు

న్యూఢిల్లీ నవంబర్ 10, (న్యూస్ పల్స్) భారత దేశం సొంత భద్రత, శత్రువులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంటోంది. ఇదే సమయంలో దేశంలోకి చొరబాట్లను అడ్డుకునేందుకు వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతోంది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో దేశం తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో ఒకేసారి సైనిక విన్యాసాలు చేపడుతోంది. గగనతల సురక్షణ కోసం ప్రభుత్వమే ముందస్తు హెచ్చరికలతో నోటామ్ జారీ చేసింది. సరిహద్దుల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోందిఅరేబియా సముద్రతీరంలోని సర్‌క్రీక్(బాణగంగ) ప్రాంతంలో ఆపరేషన్ త్రిశూల్ విజయవంతంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంగా ఉన్న ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యత కలిగినది. సముద్ర మార్గ రక్షణకు నేవీ కీలక పాత్ర పోషిస్తూ రాడార్ నిఘా వ్యవస్థలు, అధునాతన మిసైల్ యూనిట్లు మోహరిస్తోంది.చైనా, బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు సమీపంలోని సిరివిడి కారిడార్ ప్రాంతంలో పూర్వి ప్రచండ ప్రహార్ పేరుతో యుద్ధాభ్యాసం కొనసాగుతోంది. 15 నుంచి 22 కిలోమీటర్ల పొడవున ఈ వ్యూహాత్మక మార్గం ద్వారా శత్రు చొరబాట్లను నిరోధించడమే కాదు, త్రిశక్తి బలగాల సమన్వయం కూడా బలోపేతం అవుతోంది.అసోంలోని నదుల విస్తీర్ణం కారణంగా నేవీకి కీలక బాధ్యత వచ్చింది. రఫేల్స్, బ్రహ్మోస్, ఎస్?400 క్షిపణి వ్యవస్థలను సరిహద్దు ప్రాంతాల్లో మోహరించడం ద్వారా గగనతల రక్షణను మరింత ధ్రుఢపరుస్తున్నారు. మూడు విభిన్న రక్షణ శాఖలు కలిసి పనిచేసే "త్రిశక్తి కోర్" ద్వారా సర్వదిశా భద్రతా వ్యవస్థ బలోపేతమవుతోంది.సమయంలో దేశంలోని ఈశాన్య భారతంలో మూడు సరికొత్త సైనిక కారిడార్లు నిర్మిస్తోంది. అసోం, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కొత్త మిలిటరీ బేస్‌ల నిర్మాణం మొదలైంది. అసోంలోని దుగ్రి జిల్లా, బాముని గ్రామంలో లాచిట్ బర్ఫుకన్ పేరుతో ఆర్మీ బేస్ నిర్మాణం జరుగుతోంది. అసోం వీరయోధుడి స్ఫూర్తితో రూపొందిన ఈ స్థావరం మిసామారీ బేస్‌కు అనుబంధంగా సిరివిడి కారిడార్ భద్రతను చూసుకుంటుంది. ఇక రెండోది బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో నిర్మిస్తోంది. తూర్పు సరిహద్దులో రక్షణ వలయం ఏర్పరచే కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. మూడోది పశ్చిమబెంగాల్‌లోని చోప్రా గ్రామంలో జినాబ్ ప్రాంతంలో తెతూలియా కారిడార్ సమీపంలో నిర్మిస్తోంది. ఈ స్థావరం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగినది. దీనిని నిర్మాణం పూర్తయితే పశ్చిమబెంగాల్‌లోని చాలా ప్రాంతాలకు దూరం తగ్గుతుంది.అసోంలో గతంలో జరిగిన చొరబాట్లు, హింసాత్మక దాడులు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి.

ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలో సరిహద్దు భద్రతపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సైన్యంతో సమన్వయం పెరగడం ఈ మార్పుకు కారణంగా ఉంది. తాజాగా బహుముఖ చర్యలతో భారతదేశం గగన, భూ, సముద్ర మార్గాల్లో త్రిముఖ సమన్వయంతో దేశ రక్షణను మరింత శత్రుదుర్భేధ్యంగా మార్చుతోంది.

# బెంగళూరు జైల్లో ఖైదీలకు సర్వభోగాలు

బెంగళూరు, నవంబర్ 10, బెంగళూరు జైలులో సకలభోగాలు అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పలు తీవ్రమైన కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు జైలులో తెగ ఎంజాయ్ చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. కొందరు దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతుంటే.. మరికొందరు ఎంచక్కా టీవీలు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ జైలులోని ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ నోరెళ్లబెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీల లగ్జరీ లైఫ్‌కు సంబంధించిన దృశ్యాలు ఇవి.ఈ వీడియోలో కనిపించిన ఖైదీల్లో 1996 నుంచి 2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డి కూడ ఉన్నాడు. ఇతగాడికి కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అది 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మారింది. ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, టీవీలో ఐటెం సాంగ్ చూస్తూ కనిపించాడు. అతని వద్ద 2 ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో ఒఇఆ టీవీ సదుపాయం కూడా ఉంది. ప్రముఖ నటి రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైన తరుణ్ రాజు కూడా ఇదే జైలులో సకల భోగాలు అనుభవిస్తున్నాడు.

అతడున్న జైలు గదిలో స్వయంగా వంట చేసుకునే సదుపాయం కూడా ఉంది. వీరివద్దనే కాదు ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండటం విశేషం.కన్నడ నటుడు దర్శన్‌కు జైలు అధికారులు ప్రాథమిక సౌకర్యాలు నిరాకరించగా, ఇక్కడి చాలా మంది కరడుగట్టిన క్రిమినల్స్, రేపిస్టులకు మాత్రం ఎటువంటి పరిమితులు లేకుండా కటకటాల వెనుక విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తుంది.

వీరితో పాటు ఐసిస్ ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్‌కు చెందిన మరో వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అతడు జైలు లోపల గాడ్జెట్‌లు, ఇతర సౌకర్యాలు యదేచ్ఛగా అనుభవిస్తున్నాడు. ఇలాంటి అతి ప్రమాదకరమైన ఖైదీలకు నిబంధనలకు విరుద్ధంగా లగ్జరీ గాడ్జెట్లు వినియోగించేందుకు అనుమతించడం జైలు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు లోపల ఏర్పాటు చేసిన హైటెక్ సిగ్నల్ జామర్ల కారణంగా సదరు జైలు పరిసర ప్రాంతాల్లోని నివాసితుల మొబైల్ నెట్‌వర్క్ పని చేయడం లేదని నిత్యం కోకొల్లలుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీలు, సీరియల్ రేపిస్టులు, హంతకులు, నేరగాళ్లు మొబైల్ ఫోన్లు వినియోగించడం, దర్జాగా మొబైల్ ఫోన్‌ల అంతరాయం లేని నెట్‌వర్క్‌లను ఉపయోగిస్తున్నట్లు, సెల్‌ల లోపల ఊఆ నాణ్యత గల వీడియోలను చూస్తూ ఎంజాయ్ చేస్తున్నట్లు వీడియో క్లిప్స్ బయటకు వచ్చాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో సీఎం సిద్ధరామయ్య దర్యాప్తుకు ఆదేశించారు.విజువల్స్‌లో కనిపిస్తున్న ఖైదీలు 2023 బ్యాచ్‌కు చెందినవారు. ఈ ఖైదీలు మొబైల్ ఫోన్‌లను ఎలా పొందారు? జైలు లోపలికి ఫోన్‌లను ఎవరు తీసుకువచ్చారు? ఖైదీలకు ఎవరు అప్పగించారు? వీడియోలు ఎలా రికార్డ్ చేశారు? వాటిని మీడియాకు ఎవరు ఇచ్చారు? అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపి విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జైలు సిబ్బందిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# తల్లిని, తమ్ముడిని హతమార్చిన అన్న




భీమవరం సుంకరపద్దయ్య గారి వీధి మన్నా చర్చ్ ఎదురుగా దారుణంచ జరిగింది. నిందితుడు గునుపూడి శ్రీనివాస్ తల్లిని, తమ్ముడిని కత్తితో పొడిచి చంపివేసాడు. తల్లి గునుపూడి మహాలక్ష్మి ( 60). తమ్ముడు గునుపూడి రవితేజ (33) అక్కడికక్కడే మృతి చెందారు. తరువాత గునుపూడి శ్రీనివాస్ 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. భీమవరం వన్ టౌన్ పోలీసులు హత్యలపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఆస్మీ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

# ఇసుక లేక ఆగిన నిర్మాణాలు

నిజామాబాద్, నవంబర్ 10, ఇందిరమ్మ ఇళ్లకు జిల్లాలోఇసుక కటకట మొదలైంది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు ఇసుక మాఫియా అదిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. మంజీరా నీరు ప్రవహిస్తుండడంతో ఇసుక తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న మంటూ కొందరు అక్రమంగా పర్మిషన్లు తీసుకుని ఇసుకను తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. మరోపక్క ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చురుకుగా చేపట్టాలని కోరుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక లభించక ఇండ్లను మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాదులో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులు నిలుపుదల చేశారు. ఇసుక అధిక ధరలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించి ట్రిప్పుకు 5000 నుంచి 6000 రూపాయలకు విక్రయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. స్థానికా అధికారులతో కుమ్మక్కై ఇసుక దందా నిర్వహించే నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం మధ్యలోనే నిలుపుదల చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమంగా అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొని లబ్ధిదారులకు తక్కువ ధరకు తీసుకొని ఇప్పించాలని కోరుతున్నారు.

# భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ -నేడు ఆయన జయంతి..జాతీయ విద్యా దినోత్సవం

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత



ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చింది. అంతేకాదు ఈయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కానగరంలో 1888 నవంబరు 11 న జన్మించాడు. అతని వంశస్థులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు, లేదా మౌలానాల వంశం నుండి వచ్చాడు. అతని తల్లి ఒక అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, అతని తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాల ఉన్న ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వెళ్లాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. అతని విద్య ఇంట్లోనే సాగింది. మొదట తండ్రి, పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ నేర్చుకున్నాడు. తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం అభ్యసించాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. అతను దివ్య ఖురాన్ పై భాష్యం వ్రాసాడు.. అతను జమాలుద్దీన్ ఆఫ్ఘానీ పాన్-ఇస్లామిక్ సిద్ధాంతాలలో, అలిగర్ సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనలో ఆసక్తి చూపేవాడు. పాన్-ఇస్లామిక్ భావాలతో అతను ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఈజిప్ట్, సిరియా, టర్కీ సందర్శించాడు. ఇరాక్ లో అతను ఇరాన్ రాజ్యాంగ ప్రభుత్వ స్థాపనకు పోరాటం సల్పుతున్న నిర్వాసిత విప్లవ కారులను కలుసుకున్నాడు. ఈజిప్ట్ లో అతను షేక్ ముహమ్మద్ అబ్దుహ్, సయీద్ పాషా వంటి అరబ్ ప్రపంచంలోని ఇతర విప్లవకారులను కలుసుకున్నారు.

అతను కాన్స్టాంటినోపుల్లో యంగ్ టర్క్స్ భావాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాలు అన్ని అతనిని ఒక జాతీయవాద విప్లవవాదిగా రూపాంతరం చెందించాయి.

విదేశాల నుంచి తిరిగొచ్చిన అనంతరం ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్రీ శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అగుట ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాల లోపల, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తుందని భావించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు. 1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. అల్ హిలాల్ మోర్లే-మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతం-ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదుర్చటంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. 'అల్ హిలాల్' అతివాద భావనల ఒక విప్లవాత్మక ధ్వనిగా మారింది. ప్రభుత్వం వేర్పాటువాద భావనల ప్రచారకునిగా "అల్-హిలాల్"ను భావిస్తుంది. ప్రభుత్వం దానిని 1914 లో నిషేధించింది. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు. 1916 లో ప్రభుత్వం ఈ పత్రికను కూడా నిషేధించారు, రాంచిలో ఆజాద్ ను నిర్భందించారు. ఆతరువాత మొదటి ప్రపంచ యుద్ధం 1920 తర్వాత విడుదల చేసారు. విడుదల తరువాత ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గాంధీజీ ప్రారంభించిన "సహాయ నిరాకరణ" ఉద్యమం ను సమర్ధించి 1920 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. ఇతడు ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సెషన్ అధ్యక్షుడు గా (1923) ఎన్నికయ్యాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు , 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు. అతను విభజనకు వ్యతిరేకి. విభజన అతని కలలను నాశనం చేసింది. హిందువులు , ముస్లింలుకలసి సహజీవనం చేస్తున్న ఒక ఏకీకృత దేశం బద్దలు అగుట అతని కలను నాశనం చేసి అతనిని విపరీతంగా బాధించింది .మౌలానా ఆజాద్ గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయ్యాడు. అతనిని ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకర ణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. 1958 ఫిబ్రవరి 22 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మరణించాడు. గాంధీజీ ఇతడిని భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఇతడినిమౌలానా,మీర్-ఎ-కారవాన్అనిఎ ి లిచే వాడు. భారతప్రభుత్వంఆయనమరణా నంతరం 1992లోఅతనికిభారతరత్నఇచ్చి గౌరవించింది.

## 3 పార్టీలకు టెన్షన్

## భారీగా రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు

హైదరాబాద్, నవంబర్ 10 తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో ఏపీ నుంచి వచ్చిన వారు అధికంగా ఉన్నారు.. అందువల్లే ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎక్కువ ఓట్లు పడతాయి? ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది? క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.ఏపీ నుంచి చాలామంది ఇప్పటికే జూబ్లీహిల్స్ ప్రాంతానికి వచ్చారు. అలాగని వారు సర్వే సంస్థలలో పనిచేస్తున్న వ్యక్తులు కాదు. వారంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను అంచనా వేయడానికి ప్రధాన కారణం.. డబ్బు.. అలాగని వారికి ఇక్కడ ఓట్లు కూడా లేదు. ఇక్కడికి రావడానికి, క్షేత్రస్థాయిలో పర్యటించడానికి.. పార్టీల గురించి వాకబు చేయడానికి ప్రధానమైన కారణం ఒకటుంది. జూబ్లీహిల్స్ ప్రాంతంలో అనేక హోటల్స్.. లాడ్జిలలో చాలామంది దిగడానికి ప్రధాన కారణం బెట్టింగులు వేయడమే.. ఇక్కడ ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ ఓడిపోతుంది? గెలిచే పార్టీ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుంది? అనే అంశాల మీద బెట్టింగులు జోరుగా సాగుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మీద భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో గులాబీ పార్టీ అభ్యర్థి సునీత విజయం సాధించే అవకాశాలు లేకపోలేదని.. ఆమె గెలుపు మీద కూడా భారీగా బెట్టింగులు నడుస్తున్నట్టు సమాచారం. అందువల్లే వారంతా కూడా జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొద్దిరోజులుగా తిష్ట వేసినట్టు తెలుస్తోంది.. ఓ అంచనా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికలపై దాదాపు 300 నుంచి 400 కోట్ల వరకు బెట్టింగులు నడుస్తున్నట్టు తెలుస్తోంది.. కొంతమంది ప్రత్యేక ముఠాగా ఏర్పడి ఏ వ్యవహారం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఈముఠా సభ్యులు ఎప్పటికప్పుడు సర్వే చేయించుకుని.. దాని ఆధారంగా బెట్టింగ్లు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో నేటితో ప్రచారం ముగుస్తుంది. మంగళవారం పోలింగ్ ప్రారంభమవుతుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది.. నేటి సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే దాకా ఇక్కడ వైన్ షాపులను బంద్ చేస్తారు. బయట వ్యక్తులను స్థానికంగా ఉండకుండా బయటికి పంపించేస్తారు.

మాటల తూటాలు..

ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, అధికారంలో ఉన్నాం కాబట్టి గెలిచి తీరాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉన్నాయి. ఇక ఇక్కడ సత్తాచాటి తెలంగాణలో నెక్స్ట్ బీజేపీదే అని సంకేతం ఇవ్వాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నాయి. మూడు పార్టీల నాయకుల ప్రచారం చివరి రోజు ప్రత్యర్థులపై మాటల తూటాలతో దండయాత్ర చేస్తున్నారు. అభ్యర్థుల విజయాన్ని పార్టీ ప్రతిష్టగా మార్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రచారం పీక్కు చేరింది.

పోలింగ్కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్వీయ అభివృద్ధి వాగ్దానాలు, స్థానిక సమస్యల పరిష్కార హామీలు, మత?జాతి ప్రాతిపదికన కాకుండా అభివృద్ధి రహదారిగా తామే నిలుస్తామన్న ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రచార సమయం ముగిసిన వెంటనే హైదరాబాద్ పోలీసు బలగాలు ఎలక్షన్ కోడ్ అమలులోకి దిగి కఠిన పర్యవేక్షణ మొదలుపెట్టనున్నాయి. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాల ప్రకారం ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి నవంబర్ 11న సాయంత్రం ఆరు గంటల వరకు వైన్స్ షాపులు, బార్లు మూసివేస్తారు.ప్రచారం ముగిసిన వెంటనే ప్రలోభాలకు తెరతీయనున్నారు. ప్రచారంలో చివరి రోజు ర్యాలీలు, పాదయాత్రలు చేశారు. రాత్రి నుంచే డబ్బుల పంపిణీకి సిద్ధమవుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు పోలీసులూ వ్యూహం రూపొందిస్తున్నారు.

## చకచకా కొనసాగుతున్న మేడారం పనులు

వరంగల్, నవంబర్ 10 మేడారం జాతరలో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణ విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ. 4 కోట్లతో 37 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. ఈ అత్యాధునిక సాంకేతికతతో భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భద్రత కల్పించనున్నారు.తెలంగాణ గిరిజనుల పండగ.. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విద్యుత్తు సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయాలను, ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్తు శాఖ ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టింది. వర్షంతో కూడిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడడం, వాటి వల్ల సరఫరాలో అంతరాయం కలగడం సర్వసాధారణం. అంతేకాక, దట్టమైన అటవీ ప్రాంతంలో జరిగే ఈ జాతర సమయంలో దుకాణదారులు నేరుగా వైర్లను తగిలించుకుని విద్యుత్తును వాడుకోవడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంది. ఇక నుంచి వ్యాపారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడటం కదరదు. ఈ సమస్యలను అధిగమించేందుకు విద్యుత్తు శాఖ వినూత్నంగా కవర్డ్ కండక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.కవర్డ్ కండక్టర్ అంటే అల్యూమినియం తీగ చుట్టూ ప్లాస్టిక్ తొడుగు (ఇన్సులేషన్) ఉన్న విద్యుత్తు తీగలు. ఈ ప్రత్యేక ఏర్పాటు కోసం సుమారు రూ. 4 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. తొలిసారిగా అమలు చేస్తున్న ఈ ప్రణాళికలో భాగంగా, చెట్లు ఎక్కువగా ఉండి విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం కలిగే ప్రధాన ప్రాంతాలను గుర్తించారు. మొత్తం 37 కిలోమీటర్ల పొడవునా కవర్డ్ కండక్టర్ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 33 కేవీ లైన్ 21.8 కిలోమీటర్లు, 11 కేవీ లైన్ 15.45 కిలోమీటర్లు సామగ్రిని సిద్ధం చేసే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.ఇటీవల, ఈ వ్యవస్థ సామర్థ్యాన్ని పరీక్షించడానికి తాడ్వాయి మండలం కాటాపూర్ ప్రాంతంలో 3 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ వైరును ప్రయోగాత్మకంగా వేశారు. కాగా, కవర్డ్ కండక్టర్ ఏర్పాటు ఖర్చు సాధారణ విద్యుత్తు తీగల కంటే ఎక్కువ. 33 కేవీ లైన్ కవర్డ్ కండక్టర్ మీటరుకు రూ. 563 (సాధారణ తీగ రూ. 125)11 కేవీ లైన్ కవర్డ్ కండక్టర్ మీటరుకు రూ. 274 (సాధారణ తీగ: రూ. 64) కవర్డ్ కండక్టర్ వేయాలంటే ప్రతి విద్యుత్తు లైన్లో మూడు వరుసలు తీగలు లాగాల్సి ఉంటుంది. దీనివల్ల సాధారణ తీగ కంటే కవర్డ్ కండక్టర్కు నాలుగింతలు ఖర్చు అధికంగా వస్తుంది. అయినప్పటికీ, ఈ కవర్డ్ కండక్టర్లు చెట్ల కొమ్మలు తగిలినా షార్ట్ సర్క్యూట్లు జరగకుండా నిరోధిస్తాయి. ఖర్చు ఎక్కువైనా, ఈ ఏర్పాటుతో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు చాలా వరకు తగ్గుతాయి, ముఖ్యంగా జాతర సమయంలో భక్తులకు నిరంతరాయంగా విద్యుత్తు అందించడానికి, ప్రమాదాలను నివారించడానికి ఇది దోహదపడుతుంది.

## ఛాంబర్ ఎన్నికల కోసం కసరత్తులు

ఖమ్మం, నవంబర్ 10, 'ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఖమ్మం పట్టణ వ్యాపార వర్గాలకు సంబంధించిన ఓ సంఘం. దీని పరిధిలో 18 వ్యాపార వర్గాలు, వీటికి సంబంధించిన సభ్యులు 1305. మూడేళ్లకు ఓ సారి ఈ సంఘానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ లెక్కన వీటికి సంబంధించిన ఎన్నికల తంతు నామమాత్రమే అనుకో వాలి. కానీ, దీనికోసం పోటీ పడబోయే ఆయా వర్గాల హడావిడి మినీ సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి.గెలుపు కోసం ఆయా వర్గాలు పోటీ పడుతూ, తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. అయితే ఇందులో ఓ వర్గం మాత్రం గెలుపే ధ్యేయం గా వింత పోకడలు పోతోంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు 'మందు, విందు' అంటూ అడ్డదారులు తొక్కుతోంది. ఇందుకోసం చీకటి పడగానే ప్రత్యేక ఏర్పాట్లు చేసి భారీగానే ఖర్చు పెడుతోంది. సదరు వర్గం వ్యవహారాన్ని చూస్తున్న కొంతమంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'చిన్నపాటి పదవుల కోసం ఈ స్థాయిలో దిగజారాలా?' అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పానెల్ కు సంబంధించిన ఎన్నికే ముఖ్యమైనది. ఆ తరువాత దిగుమతి శాఖ కు ప్రాముఖ్యం ఉంటుంది. మిగతా శాఖలకు సంబంధించిన ఎన్నిక నామ మాత్రమే! ప్రధాన పానెల్ కు ఎన్నికల కోసం రెండు వర్గాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ప్యానెల్ లోనే అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, ట్రెజరర్ల పదవులు ఉండటం, వీటికి ఎన్నికైన వారి చేతిలోనే ఛాంబర్ అధికారాలు ఉండటమే కాకుండా ఆయా శాఖల్లో, ముఖ్యంగా గ్రెయిన్ మార్కెట్లో పలుకుబడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ప్రధాన పానెల్ ను ఎలాగైనా దక్కించుకోవాలని ఈ రెండు వర్గాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సంఘం ఓటర్లను కలిసి తమకే ఓటు వేయాలని వేడుకోవడంతోపా టు, ప్రచార చిత్రాలను, బ్యానర్లను ప్రధాన మార్కెట్ కూడళ్లలో ఏర్పాటు చేసి గెలుపు కోసం ఆరాటపడుతున్నాయి. వీరి ప్రచారంతో త్రీ టౌన్ లోని గాంధీ చౌక్, గ్రెయిన్ మార్కెట్ ప్రాంతమంతా హడావుడిగా కనిపిస్తోంది. ప్రధాన పానెల్ కు పోటీ పడుతున్న ఓ వర్గం ఛాంబర్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కసితో అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తోందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నామినేషన్ వేసిన రెండో రోజు నుంచే ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ఎత్తులు వేసింది. మందు పార్టీలు ఏర్పాటు చేసి విందులు చేసింది. ఈ విష యం బయటకు పొక్కడంతో తమ ప్యానెల్ కు చెడ్డ పేరు వస్తోందని, దీనివల్ల తమ ఓటు బ్యాంకు కి చిల్లు పడే అవకాశం ఉందని భావించి వేరే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నేరుగా మందు పార్టీ అని కాకుండా జన్మదిన వేడుకల ముసుగులో మద్యం పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఇందుకోసం ఛాంబర్ ఓటర్లలో ఎవరిదైనా పుట్టినరోజు ఉందేమోనని ఆరా తీసి, వారి పేరిట సాయంత్రం మందు పార్టీకి సదరు వర్గం సన్నాహాలు చేస్తోంది. ఆ రోజు జన్మదినం జరుపుకునే వారిని తాము నిర్ణయిం చిన చోటుకి సాయంత్రం పిలిపించి, వారితో కేకు కోయించి సంబరాలు చేస్తున్నారు. ఆ తర్వాత సంబరాలకు వచ్చిన వారిని మందు, విందుల్లో ముంచి తేల్చుతున్నారు. ఈ మందు పార్టీకి ఓటర్లలో ఎవరిని ఆహ్వానించాలో ఉదయమే నిర్ణయించి, వారికి రహ స్యంగా సమాచారం అందించడమే కాకుం డా, వారంతా తామిచ్చే పార్టీకి కచ్చితంగా హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రతిరోజు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచా రం. దీనికి సంబంధించిన ఖర్చును సదరు వర్గం తరఫున పోటీపడే వారు వాటాలు వేసుకొని భరిస్తున్నట్లు తెలుస్తోంది. ఛాంబర్ ఎన్నికలకు పోటీ పడుతున్న వారంతా వ్యాపారులే! వీరంతా తమ పెట్టుబడి మీద 10% నష్టాన్ని కూడా భరిం చడానికి ఒప్పుకోరు. లాభం లేనిదే రూపా యి కూడా ఖర్చు చేయరు. అలాంటిది సదరు వర్గం పార్టీల పేరిట ఎన్నికల నాటికి (నవంబర్ 16) చేసే ఖర్చు దాదాపు రూ.20 నుంచి రూ.25 లక్షల మేర వస్తుందని అంచనా! కేవలం ఛాంబర్ పదవుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేస్తుండటంపై పలు సం దేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలి చి పదవులు దక్కితే, ఆ తర్వాత ఛాంబర్ కు వచ్చే ఆదాయం నుంచి తాము పెట్టిన ఖ ర్చును ఎలాగో ఒకలాగా రాబట్టుకోవచ్చనే భావనలో సదరు వర్గం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఛాంబర్ ను తన గుప్పెట్లో పెట్టుకొని తమ వ్యాపారాలను ఇష్టరీతిన నిర్వహించుకునేందుకే ఈ వ్యవహారమంతా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు వర్గం చేస్తున్న హడావుడి చూస్తుంటే ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్యానెల్ నుంచి ప్రధాన పదవులకు పోటీ పడబోతున్న వారి పైన మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. ఈ ప్యానెల్ లోని ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డాడు అనే విమర్శలు ఉన్నాయి. ఇక దీనికి తోడు ఇతరత్రా వర్గాల్లో కాస్త మేనేజ్ చేయగలిగిన వ్యక్తులను చేరదీసి, తన వెంచర్లలో చీకటి వ్యవహారాలు చేయిస్తాడనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి గురించి తెలిసిన కొంతమంది వ్యాపారులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండడం గమనార్హం! ఇక పానెల్ మరో ప్రధాన సీటుకి పోటీ పడబోతున్న ఓ పెద్ద ఖరీదుదారు కమీషన్ వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తాడనే ప్రచారం ఉంది. కటింగ్ బిల్లుల వ్యవహారంలో ఊరంతా ఓ పోకడైతే, సదరు వ్యాపారిది మరో దారి. కటింగ్ బిల్లుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాడన్న ప్రచా రం ఉంది. సదరు పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు రేటుని తగ్గిస్తే, మిగతా వ్యాపారులు కూడా తగ్గిస్తారు.

దీని వల్ల కమిషన్ వ్యాపారులకు కాస్త ఊరట కలుగుతుంది.

కానీ ఈ పెద్ద వ్యాపారి కటింగ్ బిల్లు వ్యవహారంలో కాస్త కూడా పట్టు విడుపు ప్రదర్శించడని సమాచారం. ఇలా అక్రమ వ్యవహారాల్లో పాలు పంచుకునే వ్యక్తి, వ్యాపారుల గురించి కనీసం ప ట్టించుకోని వ్యక్తులు ఛాంబర్ పదవులకు ఎ లా పోటీ చేస్తారని, ఒకవేళ గెలిచినా వ్యాపార వర్గాలకు ఎలా న్యాయం చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 100 కోట్ల భూ కబ్జాపైవేగవంతంగా విచారణ పూర్తి చేయాలి

## మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత

జగిత్యాల, జిల్లా కేంద్రమైన జగిత్యాల పట్టణంలో సంచలనంగా మారిన 100 కోట్ల భూకబ్జాపై వేగవంతంగా విచారణ జరపాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత -సురేష్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. జగిత్యాల పట్టణంలో గత వారం, పది రోజులుగా జరుగుతున్న 100 కోట్ల భూకబ్జా అంశంపై విచారణ వేగవంతం చేస్తూ, జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గల సర్వే నెంబర్ 138తో పాటుగా, ఆ భూమిని అనుకోని చుట్టూ ఉన్న సర్వే నెంబర్ సర్వే నెంబర్ లలో భూమి అన్యాక్రతం అయినట్లుగా ఆరోపణలు, వాటి ఆధారంగా పత్రికలు, మీడియాలో వస్తున్న వార్త కథనాల నేపథ్యంలో జిల్లా అధికారం యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఇదే స్థలం అనుకోని అనేక వ్యాపార, వాణిజ్య స్థలాలు సైతం ఉన్నందున నిష్పక్షపాత విచారణ జరిపి, ప్రభుత్వంకు సంబంధించిన భూమి దురాక్రమణకు గురైనట్లయితే వెంటనే స్వాదీనపరిచ్చుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత- సురేష్ భారత రాష్ట్ర సమితి పక్షాన సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. 100 కోట్ల పైబడిన ఆస్తి కబ్జాపై ఇటీవల మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళింది విధితమే. ఈ క్రమంలో కబ్జా అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని వివిధ పార్టీల మద్దతు కూడా లభిస్తోందన్నారు.

# శివ శివ ఇదేమి విడ్డూరం.. నడిరోడ్డుపై భక్తుల తలనీలాలు

## రాజన్న ఆదాయానికి గండి , పట్టించుకోని ఆలయ అధికారులు







**వేములవాడ టౌన్, (ప్రజాబలం దినపత్రిక),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంతం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. రాజన్న ఆలయం అభివృద్ధిలో భాగంగా ప్రధాన ఆలయం చుట్టూ గతంలో ఉన్న కళాభవన్, కళ్యాణ కట్ట, నివేదన భవనం, లడ్డు తయారీ కేంద్రం, పాత ఆంధ్ర బ్యాంకు కార్యాలయం, రాజన్న ఆలయ ఈవో కార్యాలయం, ఓపెన్ స్లాబ్ తదితర భవనాలను కూల్చివేయడం జరిగింది. రాజన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆలయ అధికారులు ఆలయంలో లఘు దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. కోడె మొక్కులు, స్వామి వారి కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, స్వామి వారి లడ్డు ప్రసాదాలు అన్నీ కూడా భీమేశ్వర ఆలయం పరిసర ప్రాంతాలలో నిర్వహిస్తున్నారు. కోడె మొక్కులు మొక్కుకొని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, తలనీలాలు సమర్పించడానికి ఈ మధ్యకాలంలో నిర్మించిన వాహన పూజల కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో ప్రస్తుతం కళ్యాణకట్టను నిర్వహిస్తున్నారు. అక్కడ భక్తులకు పూర్తి సౌకర్యాలు లేక, స్థలము సరిపోక, సోమవారం నాయి బ్రాహ్మణులు వేములవాడ కట్ట కింద జగిత్యాల బస్టాండ్ మెయిన్ రోడ్డుపై మున్సిపల్ చెత్తకుప్పల వద్ద తల నీలాలు తీయడం జరిగింది. జగిత్యాల బస్టాండ్ ప్రాంతం మొత్తం చెత్తాచెదారం, తల వెంట్రుకలతో నిండిపోయింది. ఇదే అదునుగా కొంతమంది నాయి బ్రాహ్మణులు తలనీలాలు సమర్పించే భక్తులను కింద లేదా స్టూల్ మీద గాని కూర్చోబెట్టి తలనీలాలు తీయడం పద్ధతి కానీ ఇక్కడ నాయి బ్రాహ్మణులు డబ్బులకు కక్కుర్తి పడి పది నుండి 15 సంవత్సరాల పిల్లలను నడిరోడ్డుపై నిలబెట్టి తలనీలాలు తీయడం అక్కడున్న రాజన్న భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిని ఆలయానికి సంబంధించిన ఏ అధికారి అడ్డుకోకపోవడంపై రాజన్న భక్తులు తమ విస్మయాన్ని వ్యక్తపరిచినారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధిపరిచే క్రమంలో ఆలయ అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన రెండు నుండి మూడు చోట్ల కళ్యాణ కట్టలు నిర్మించవలసిన ఉండగా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో నడిరోడ్డుపై తలనీలాలు తీసే సంఘటన జరిగినట్లు భక్తులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. అలాగే అమ్మవారి కాంప్లెక్స్ వద్ద కూడా కొంతమంది నాయి బ్రాహ్మణులు కాంప్లెక్స్ లోపల, కాంప్లెక్స్ బయట రోడ్డుపైన కూడా తలనీలాలు తీయడం కనిపించింది. కట్టకింద జగిత్యాల బస్టాండ్ లో తలనీలాలు సమర్పించే భక్తులు ఆలయానికి సంబంధించిన తలనీలాల టికెట్ పొందకుండానే నాయి బ్రాహ్మణులకు డబ్బులు చెల్లించి తలనీలాలు సమర్పించడం జరిగింది అని రాజన్న భక్తులు పేర్కొన్నారు. దీనితో రాజన్న ఆలయానికి రావలసిన ఆదాయం గండి పడింది. రాబోయే రెండు నెలల కాలంలో మేడారం సమ్మక్కబిసారక్క జాతర ఉన్న సందర్భంలో మేడారం వెళ్లే భక్తులు ఆనవాయితీ ప్రకారం మొట్టమొదట వేములవాడ రాజన్నను దర్శించుకుని తదుపరి మేడారం వెళ్లే ఆనవాయితీ ఉన్నందున ఇప్పటినుండి ప్రతినిత్యం రాజన్న ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అధికారులు వెంటనే తాత్కాలిక ప్రాతిపదికన కళ్యాణ కట్టలు నిర్మించి ఆలయానికి వచ్చే ఆదాయాన్ని కాపాడాలని రాజన్న భక్తులు కోరుతున్నారు

## విశాఖ సీఐఐ సదస్సు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుంది

### మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ అవిశ్రాంత కృషి చేస్తున్నారు. విశాఖ సీఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదిక అవుతుందని విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు మంత్రి విశాఖలో మీడియాతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా 410 ఒప్పందాలు, రూ. 9.76 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.48 లక్షల ఉద్యోగాలు లభించనున్నాయి. సీఐఐ సదస్సులో 112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు చేయబోతున్నాం. సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు, 200 మంది భారత అగ్రశ్రేణి సంస్థల సీఈవోలు, పలువురు కేంద్ర మంత్రులు హాజరవుతారు. ఈ సదస్సులో భాగంగా 48 కీలక సెషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, హ్యాకథాన్, బిజిన్ సెస్ టూ గవర్నమెంట్ సమావేశాలు జరుగుతాయి. విశాఖ సీఐఐ సదస్సు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.

# సర్వశక్తులు ఒడ్డిన పార్టీలు

హైదరాబాద్, నవంబర్ 10 జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ అని చెప్పాలి. ఈ ఉప ఎన్నిక ఫలితంతో అన్ని అనుమానాలకు చెక్ పెట్టవచ్చన్నది ఆయన ఆలోచన. అదే సమయంలో ఏ మాత్రం తేడా వచ్చినా అందుకు రేవంత్ రెడ్డి పార్టీ పరంగా ఇబ్బందులు కూడా ఎదుర్కొనాల్సి వస్తుంది. అందుకే ముఖ్యమంత్రి హోదాలో కూడా రేవంత్ రెడ్డి బస్తీ పర్యటనలు చేస్తూ, కార్నర్ మీటింగ్ లలో పాల్గొంటూ, రోడ్ షో లు చేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్వశక్తులూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం వినియోగిస్తున్నారు. అందుకే తనతో పాటు మంత్రివర్గాన్ని మొత్తాన్ని ప్రచారంలోకి దించారు.బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు కావడంతో పాటు సెంటిమెంట్ ఏదైనా పనిచేసే అవకాశముందని భావించిన రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లే కనపడుతుంది. నిజంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక రేవంత్ పాలనకు పరీక్ష అని చెప్పాలి. రెండేళ్ల పాలనకు ఇది రెఫరెండంగానే ప్రజలు చూడకపోయినా ప్రత్యర్థులు, హైకమాండ్ చూస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధికారంలో ఉండి ఉప ఎన్నికలో పార్టీకి విజయం సాధించి పెట్టకపోతే వచ్చే విమర్శలకు కూడా రేవంత్ రెడ్డి తట్టుకుని నిలబడాల్సి ఉంటుంది. ఆ విషయం ఆయనకు కూడా తెలుసు. అందుకే సైన్యాన్ని మొత్తాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలోనే మొహరించారు. మరొకవైపు ఈ ఎన్నిక తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నిక ఫలితం ప్రభావం కూడా లోకల్ ఎన్నికలపై పడుతుంది. అయితే రేవంత్ రెడ్డి పూర్తిగా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో వచ్చాయి. అందుకే సామాజికవర్గాల వారీగా సమావేశమవుతూ రేవంత్ రెడ్డి విజయాన్ని గాంధీభవన్ కు చేరువ చేసే ప్రయత్నంలో పడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దాదాపు లక్షన్నర మంది ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఓటర్లున్నారు. వీటిలో 80 శాతం ఓట్లు పడితే చాలు అని భావించారు. ఎంఐఎం మద్దతు కూడా తమకు కలసి వస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఆంధ్రప్రాంత ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, సినీ కార్మికులకు వరాలు ప్రకటించడం వంటి చర్యలతో ముందుకు వెళుతున్నారు. మరి చివరకు ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందన్నది చూడాలి.

గులాబీకి ఊహించనిషాక్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఇన్ని రోజులపాటు నేతలు పోటాపోటీగా ప్రచారం చేశారు. చివరి రోజు కూడా నేతలు ఎవరూ తగ్గలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. భారత రాష్ట్రపతి అధినేత కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేశారు. కేటీఆర్ కూడా అదే స్థాయిలో రెస్పాండ్ అయ్యారు. ఇక బిజెపి నేతలు అటు గులాబీ పార్టీని.. ఇటు కాంగ్రెస్ పార్టీని తీవ్ర స్థాయిలో విమర్శించారు.ఈ పరిణామాలు జరుగుతుండగానే గులాబీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. మాగంటి గోపీనాథ్ తల్లి, మొదటి భార్య కుమారుడు తెరపైకి వచ్చారు. హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. "నాడు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నన్ను బెదిరించారు.. హాస్పిటల్ రావద్దని అన్నారు. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందాం అని చెప్పారు. మా నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పలేదు. నన్ను మాత్రమే కాదు, మా పెదనాన్న కూడా రావద్దని చెప్పారు. నాకు మా గంటి సునీత నుంచి ఫోన్ కూడా వచ్చింది. ఆ ఫోన్ నెంబర్, అఫిడవిట్ లో ఆమె ప్రస్తావించిన ఫోన్ నెంబర్ ఒకటే. కావాలంటే మీరు చూసుకోండి. హాస్పిటల్ రావద్దని ఒక నోట్ కూడా పంపారు. ఆ నోట్ లో మా కుటుంబ సభ్యుల పేర్లు ప్రస్తావించారు. ఇలా మమ్మల్ని అనుక్షణం ఇబ్బంది పెట్టారు. కనీసం మా నాన్న చివరి చూపు కూడా మమ్మల్ని చూసుకోకుండా చేశారని" మాగంటి గోపీనాథ్ కుమారుడు, మాగంటి గోపీనాథ్ తల్లి ఆరోపించారు.మాగంటి గోపీనాథ్ మరణానికి సంబంధించి తనకు అనుమానాలు ఉన్నాయని మొదటి నుంచి కూడా ఆయన మాతృమూర్తి ఆరోపిస్తూ వస్తున్నారు. ఇటీవల గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ను ఉద్దేశించి ఆమె తీవ్రస్థాయిలో విమర్శలు కూడా చేశారు. ఇప్పుడు తెరపైకి మాగంటి గోపీనాథ్ కుమారుడు వచ్చారు. కీలకమైన ఆధారాలను బయటపెట్టారు. తమ తండ్రి మరణం తర్వాత ఏ స్థాయిలో ఇబ్బంది పెట్టారో ఆయన వివరించారు. పోలింగ్ కు ఒకరోజు ముందుగానే వారు ఈ విషయాలు వెల్లడించడంతో.. గులాబీ పార్టీకి షాక్ తగిలే విధంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మాగంటి గోపీనాథ్ విషయంలో మొదటినుంచి కేటీఆర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని.. అది ఇప్పుడు నిరూపితమైందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

మాగంటి గోపీనాథ్ మాతృమూర్తి.. ఆయన మొదటి భార్య కుమారుడు కీలకమైన విమర్శలు చేసిన నేపథ్యంలో గులాబీ పార్టీ నాయకులు ఏ విధంగా స్పందిస్తారు? మాగంటి సునీత ఎలా రెస్పాండ్ అవుతారు? అనే విషయాలకు సమాధానాలు తెలియాల్సి ఉంది.

## తలాపాపం చెరో పిడేకెడు అన్నట్లుగా భూమి అన్యాక్రాంత అంశం.

**జగిత్యాలలో భూ వివాదం పై పారదర్శక విచారణ జరపాలి.**

**ఆక్రమణ జరిగితే తక్షణమే ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలి.**

**మున్సిపల్, రెవెన్యూ విభాగాలా నిర్లక్ష్యం వల్లనే ఈ దుస్థితి.**

**ఈ అంశం పై అవసరం అయితే సీఎస్ ని కలిసి విజ్ఞప్తి చేస్తాం.**

**జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత**

జగిత్యాల, జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో వంద కోట్ల భూమి కబ్జా అయ్యిందని వస్తున్నా ఆరోపణలు, పత్రిక కథనలపై అధికార గణం తక్షణమే స్పందించి వివాదం పై పారదర్శక విచారణ జరిపించాలని జగిత్యాల జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత– సురేష్ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కి వెళ్లి అదనపు కలెక్టర్ లత కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ గత 70 ఏళ్ల నుండి సమస్య ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్ల వందల కోట్ల ఎకరాల భూమి ప్రభుత్వం నుండి వెళ్లి వ్యక్తుల చేతిలో బంధీ అయ్యిందని విమర్శించారు. జగిత్యాల లోని 138 సర్వే నెంబర్ లో ఉన్న భూమి విషయం చుస్తే తలా పాపం చేరో పిడికెడు అన్నట్టుగా ఉందని విమర్శించారు. ప్రజల ఆస్తి ప్రజలకే చెందాలనే కేసీఆర్ స్ఫూర్తి తో బీఆర్ఎస్ పక్షాన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఆనాడు అక్రమ నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది ఎవరు? ఈ విషయం పై మున్సిపల్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని వసంత డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆస్తిని నిబంధనలకు విరుద్ధంగా ధారాదత్తం చేయడంలో భాగం ఉన్న ప్రతి అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవహారం అంత కిభాల చుట్టే తిరుగుతుందని, కిభాల ప్రతిని ట్రాన్స్ లేట్ చేయించి వాస్తవాలను బయటపెట్టాలన్నారు.విచారణలో భూ అక్రమాలు జరిగితే భూమిని స్వాదీనం చేసుకోవడంతో పాటుగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వసంత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశం ఇక్కడితోనే ఆగదని, హై కమాండ్ ద్రుష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి వారి సహకారంతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేస్తామని వసంత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్,బీఆర్ఎస్ నాయకులు శీలం ప్రవీణ్, నాచుపెల్లి రెడ్డి, అనురాధ, నక్క గంగాధర్, రిజ్వాన్, నీలి ప్రతాప్, గంగిపెల్లి వేణుమాధవ్, గాజుల శ్రీనివాస్, మధుకర్,ప్రణయ్,భగవాన్ రాజ్ కోటగిరి మోహన్,నవదీప్, జవీద్ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# జూబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధం

## ఉల్లంఘనలపై ఉక్కుపాదం.. రూ.3.60 కోట్లు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 10 జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. నియోజకవర్గంలోని సగానికి పైగా పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, అసాధారణ భద్రతా ఏర్పా ట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సమగ్రంగా వివరించారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారని కర్ణన్ తెలిపారు. వీరిలో 1,908 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారు 2,134 మంది, 18–19 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 6,859 మంది ఉన్నారని వివరించారు.ఓటర్ల సౌకర్యార్థం 139 భవనాల్లో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా, వీటిలో 226 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ కేంద్ర బలగాలతో సహా అదనపు భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియను డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉండటంతో, సాంకేతికంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీప్యాట్తో పాటు నాలుగు బ్యాలెట్ యూనిట్లను ఉపయోగిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఇది ఓటర్లు గమనించాల్సిన కీలకమై న అంశమన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 561 కంట్రోల్ యూనిట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు, 595 వీవీప్యాట్లను సిద్ధంగా ఉం చామన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా స్పందించేందుకు 40 మం ది ఈసీఐఎల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచా మన్నారు. మొత్తం 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని చెప్పారు.ప్రశాంత పోలింగ్ కోసం నగర పోలీసులతో పాటు, ఐటీ, ఎక్సైజ్, నార్కోటిక్స్ వంటి వివిధ విభాగాలతో కూడిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ నిరంతరం పనిచేస్తోందన్నారు. అన్ని 407 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, ఎన్నికల సంఘం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పర్యవేక్షించేందుకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఓటర్ల సహాయార్థం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్కు, క్యూలైన్లను పర్యవేక్షించేందుకు ఎన్సీసీ వాలంటీర్లు, పోలింగ్ కేంద్రం లోకి ప్రవేశించే ముందు ఓటర్లు తమ మొబై ల్ ఫోన్లను భద్రపరుచుకునేందుకు మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు, రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎంసీసీ ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు ఖ27 కేసులు నమోదు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వై లెన్స్ బృందాలు కలిసి రూ. 3,60,50,952 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయని కర్ణన్ వెల్లడించారు. ప్రచారం ముగిసిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి అక్రమాలకు తావివ్వ కుండా నిఘా కొనసాగుతుందన్నారుప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం యూసుఫ్గూడలోని కోట్ల విజయభాస్కర్రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలకు పోలింగ్కు ముందు రోజు నవంబర్ 10, సోమవారం, పోలింగ్ రోజు నవంబర్ 11, మంగళవారం, కౌంటింగ్ రోజు నవంబర్ 14, శుక్రవారం వేతనంతో కూడిన సెలవు దినాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఓటర్లందరూ నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు.

## ప్రముఖ కవి డా. అందెశ్రీ మృతి

## మాజీ ఎంపీ నామ సంతాపం



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం)** ప్రముఖ కవి రచయిత డా. అందెశ్రీ అకాల మరణం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అందెశ్రీ గారి లేని లోటు సాహిత్య ప్రపంచానికి తీరని లోటు అని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలను ఉత్తేజపరిచిన అనేక గేయాలు, కవితలు ఆయన కలం నుంచి వెలువడి చరిత్రలో నిలిచిపోయాయని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన రచనలు భావజాలం సందేశాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు డా. అందెశ్రీ  కుటుంబ సభ్యులకు అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు

## తెలంగాణ గడ్డపై ప్రజాకవి అందశ్రీ పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ప్రముఖ రచయిత,కవి అందేశ్రీ మరణం బాధాకరం అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు,అందెశ్రీ 2004 సంగారెడ్డి ధూంధాంతో ఆయన పాటతో నాకు పరిచయమైంది,తెలంగాణ ఉద్యమ సమయంలో అందేశ్రీ పాటలు ప్రజలను చైతన్యపరిచాయి. తెలంగాణ గడ్డపై ప్రజాకవి అందశ్రీ పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఎవరు మర్చిపోలేం. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలది ప్రధాన పాత్ర. ఆయన మరణం తెలంగాణ ప్రజలకి తీరనిలోటు ఆయన మరణించినా అందెశ్రీ పాట కి మరణం లేదు,తనని పాట ఎప్పటికీ సజీవం గానే ఉంచుతుంది. అందెశ్రీ పాట వింటే పాటలో లోనమయిపోతం. సమాజం గురించి మనిషి గురించి మనుషులు ఎలా వుండాలనే దానిపై అందెశ్రీ పాటలు మనలో చైతన్యం కలిగిస్తాయి.ఆయన ఆత్మకుశాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను,ఆయనకు నివాళులు అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని అన్నారు.

## అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు..

## ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఆయన తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక...
ఆయన ఉద్యమ లక్షణాలు, ఆయన పోరాట పటిమ.. ఆయన రచనలు, ఆయన పాటలు ప్రస్తుత సమాజానికి యువతకు ఎంతో స్ఫూర్తి..
ఆయన తెలంగాణ చరిత్ర, ఉనికి, ఉద్యమ చరిత్రలపై సాహిత్యం పైన రాసిన పాటలు చరిత్రలో నిలిచిపోతాయి..
ఆయన రాసిన జయ జయహే తెలంగాణ పాటను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రీయ గీతంగా అధికారికంగా ప్రకటించి గౌరవించింది.
ఆయన మరణం పట్ల నా ప్రగాఢ సంతాపం..
ఆయన కుటుంబానికి నా సానుభూతి. ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్న...

## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన అందెశ్రీ

హైదరాబాద్(ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. తెలంగాణ సాహితీ లోకానికి, ముఖ్యంగా ప్రజా సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అపారమైనవని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ నేల, నాటి ఆచారవ్యవహారాలు, సాంస్కృతిక విలువలు, సమాజ సమస్యలు, కార్మిక?బహుజన జీవనసత్యాలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ, అందెశ్రీ గారు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అని తెలంగాణ రాష్ట్ర గీతం తో పాటు ఎన్నో విప్లవాత్మక మరియు సామాజిక అంశాలపై గేయాలు రచించారు, అలాగే నిప్పుల వాగు వంటి పుస్తకాలు ఆయన సాహిత్య పటిమకు సాక్ష్యాలు. తెలంగాణ కవిత్వాన్ని ప్రజలకు దగ్గర చేసిన ప్రజాకవి అందెశ్రీ గారి మరణం తెలంగాణ సాహిత్యరంగానికి పూడ్చలేని లోటు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. దేవుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నానని అన్నారు..

## అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ ప్రజాగాయకుడు శ్రీ అందేశ్రీ గారి అకాల మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు

తెలంగాణ ఆవిర్భావంలో ఆయన రచనలు, గానం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు.

అందెశ్రీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న వినియోగదారుల సమాఖ్య

## సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి

హైదరాబాద్ నవంబర్ 10 : వివిధ దశలలో వినియోగదారులలో చైతన్యం పెంచేందుకు భారత వినియోగదారుల సమాఖ్య (సిసిఐ) నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నదని, దీనిలో భాగంగా సిసిఐ జోనల్, జిల్లా స్థాయిల్లో విస్తరణ చేస్తున్నదని సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రెడ్ క్రాస్ భవన్ లో సీసీఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి అధ్యక్షతన  జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినియోగదారుల పక్షాన నిలబడి వారికి అండగా రూపొందించబడిన చట్టాలు బ్యూరోక్రాట్లు, వ్యాపార ఉత్పత్తిదారుల అజమాయిషితో నీరుగారిపోతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులకు నాయకత్వం వహిస్తున్న సిసిఐ చట్టాల రూపకల్పనలో కీలక భూమిక నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాజధాని వరకు వివిధ స్థాయిలో ఉన్న వినియోగదారుల సమస్యలను గుర్తించి వారి పక్షాన పోరాడుతున్న క్రమంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మరింత చేయూతనిచ్చేందుకు సీసీఐ  జోనల్ ఇన్చార్జిల నియామకం చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు జోన్లను ఏర్పాటు చేసి సీనియర్ వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులను, సీసీఐకి రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో ఏర్పాటుచేసిన కమిటీలను సిసిఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమిరెడ్డి ప్రకటించారు. నెలాఖరుకల్లా జిల్లా స్థాయిలో సిసిఐ ప్రతినిధుల ఎంపిక పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో  సిసిసి సెక్రటరీ జనరల్ మొగిలిచర్ల సుదర్శన్, సీసీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ హరిప్రియ రెడ్డి, సీసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుప్రభ హత్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, రావుల రంజిత్ కుమార్, సందు ప్రవీణ్, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి , ప్రవీణ, రంగన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ జోనల్ ఇన్చార్జులు వీరే...

ఆదిలాబాద్ జోనల్ ఇన్చార్జిగా మాజీద్, వరంగల్ జోనల్ ఇన్చార్జిగా బి శ్రవణ్ కుమార్, నల్గొండ జోనల్ ఇన్చార్జిగా ఎం .యశ్వంత్ కుమార్, హైదరాబాద్ జోనల్ ఇంచార్జ్ గా ఏవి రావు, మహబూబ్ నగర్ జోనల్ ఇన్చార్జిగా అనుదివ్య లను నియమించారు.

## అందెశ్రీ మరణం తెలంగాణ కు తీరాని లోటు..

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..



తెలంగాణ కవి, ఉద్యమ కారులు, సాహితీవేత్త అందెశ్రీ మరణం తెలంగాణ కు తీరని లోటు..
టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..
ఆయన ఆకస్మిక మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. .
తెలంగాణ సాహితి దిగ్గజాన్ని కోల్పోయాము..
ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటు..
అందెశ్రీ పాట జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేసింది.
రాష్ట్ర అవతారంలో ఆయన పాత్ర చాలా కీలకమైంది.
ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.
,ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..
మహేష్ కుమార్ గౌడ్....

## అందెశ్రీ మృతిపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..



ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతిపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం రాష్ట్ర ఏర్పాటులో సబ్బండ వర్గాలకు ఒక్కతాటి మీదకు తీసుకొచ్చి ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి  తీరని లోటు అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆయన అకాల మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆయన మృతి పట్ల ప్రగడ సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు మంత్రి సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.



ప్రజాకవి అందెశ్రీ గారి మృతి పట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" అనే పాటతోపాటు ఎన్నో ఉద్యమ గీతాలు రాసిన ప్రజాకవికి హృదయపూర్వక శ్రద్ధాంజలి. సాహిత్యానికి అందెశ్రీ గారు అందించిన సేవలు చిరస్మరణీయం. వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను.


...నారా లోకేష్,
విద్య, ఐటీ శాఖల మంత్రి.

## అందె శ్రీ ఆకస్మిక మృతి పట్ల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

తెలంగాణ రాష్ట్ర గీతం ..జయ జయహే ..తెలంగాణ గీతాన్ని రచించిన రచయిత.. అందె శ్రీ ఆకస్మిక మృతి పట్ల ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి  అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర  దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
తెలంగాణ ఆవిర్భావానికి ఆత్మ అయిన ఆయన రచనలు ప్రతి తెలంగాణ వాది రక్తంలో ఉత్సాహాన్ని, ఆవేశాన్ని, ఆత్మగౌరవాన్ని నింపాయని మంత్రి పేర్కొన్నారు.
ప్రజల మనసునుండి ఉద్భవించిన సాహిత్య ధారలు అందెశ్రీ గీతాలు, రచనలు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిందన్నారు. ప్రజల జీవన గాథలకు శాశ్వత స్వరాలునిచ్చాయని,
వారి కలం సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానం కోసం తుపాకీలా పనిచేసిందని పేర్కొన్నారు .
తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో అందెశ్రీ కృషి అపూర్వం.తన కవిత్వం ద్వారా దళితులు, అట్టడుగు వర్గాల కష్టాల్ని గళమెత్తి ప్రపంచానికి వినిపించిన మహానుభావుడనీ ఆయన కొనియాడారు.
అందెశ్రీ లాంటి ప్రజాకవినీ కోల్పోవడం తెలంగాణ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.
"ఆయన కలం ఆగిపోయినా, ఆయన ఆలోచనలు తెలంగాణలోని ప్రతి ఒక్కరి గుండెలో ఎప్పుడు పదిలంగానే ఉంటాయి" అన్నారు.
దళిత ఆత్మగౌరవ ఉద్యమాలకు అందెశ్రీ రచనలు శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.
అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ,
ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాననీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

## 'మాయమై పోయాడమ్మ మనిషన్నవాడు'

## ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూత



హైదరాబాద్ నవంబర్ 10 : ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశువు కవిత్వ చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.

## ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు

## క్షేమంగా బయట పడ్డ ప్రయాణికులు


రాజుపాలెం,  ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన మరొక బస్సు సోమవారం ప్రమాదానికి గురి అయింది. పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, రెడ్డిగూడెం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ కు చెందిన బస్సు అదుపుతప్పి గుంటలోకి దూసుకు వెళ్ళింది. ఎమర్జెన్సీ డోర్ ద్వారా బస్సులోని ప్రయాణికులు  బయటకు వచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 30 మంది ప్రయాణికులు ఉన్నారు.ఈ ఘటన నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి ఎకనామిక్ మాస్టర్ ప్లాన్

**క్లస్టర్లుగా ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల అభివృద్ధికి బ్లూ ప్రింట్**

**వీఈఆర్‌కు అవసరమైన పాలసీల రూపకల్పన**

**విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, నవంబరు 10: శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన పాలసీలను రూపొందించాలని సూచనలు జారీ చేశారు. సోమవారం సచివాలయంలో జరిగిన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ కే.విజయానంద్, ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ , మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీఈఆర్ ప్రాంతం రాష్ట్రానికి గ్రోత్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై ముఖ్యమంత్రి వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న వివిధ జిల్లాలను విశాఖ ఎకనామిక్ రీజియన్ గా అభివృద్ధి చేసే విషయంలో స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించిన ఎకనామిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సీఎం స్పష్టం చేశారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా వీఈఆర్ గ్లోబల్ ఎకనామిక్ హబ్ గా మారుతుందని సీఎం వ్యాఖ్యానించారు. పోర్టుల ద్వారా కార్గో హ్యాండ్లింగ్ తో పెద్ద ఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందని అన్నారు. శ్రీకాకుళం మూలపేట పోర్టు నుంచి రీజియన్ లోని కాకినాడ పోర్టు వరకూ హింటర్ ల్యాండ్ లోని చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్య ప్రదేశ్ లాంటి ప్రాంతాలకు చెందిన కార్గోను కూడా రవాణా జరిగేలా చూడాలని సూచించారు. మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకూ షిప్ బిల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్యలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర దక్షిణాది రాష్ట్రాలను కలుపుతున్న ఏపీ ఇక ఈస్ట్ వెస్ట్ కారిడార్ గానూ మారాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 12-15 మాన్యుఫాక్చరింగ్ నోడ్స్ కలిగిన ప్రాంతంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ మారుతుందని అన్నారు. ప్రత్యేకించి ఈ రీజియన్ లో క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. విశాఖ లాంటి ప్రాంతాలు నెక్స్ జెన్ ఐటీ డేటా సెంటర్ , ఏఐ ఇన్నోవేషన్ మారుతున్నాయని .. ఈ రీజియన్ లోని ఇతర ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ హెల్త్ కేర్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. అలాగే ప్రణాళికా బద్ధంగా పట్టణీకరణ- హౌసింగ్ ప్రాజెక్టులు రావాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్లమ్ క్లస్టర్ రీడెవలప్మెంట్ కోసం ప్రత్యేకంగా విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సుస్థిరాభివృద్ధికి దీపస్తంభంగా విశాఖ రీజియన్

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాంతంలో 100 నుంచి 115 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రకటించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా 15 బిలియన్ డాలర్ల మేర, ప్రైవేటు కార్పోరేట్లు, సంస్థల ద్వారా 85 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్టు సీఎం తెలిపారు. ఈ ప్రాంతంలోని పోర్టులను రైల్వే లైన్లతో అనుసంధానం చేయనున్నట్టు వెల్లడించారు. త్వరలోనే ఈ మార్గంలో రైల్వే మార్గాలు నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్రం ప్రణాళికలు చేస్తోందని అన్నారు. ఈ జిల్లాల్లో వచ్చే ప్రాజెక్టులను క్లస్టర్ అప్రోచ్ తో ప్రాజెక్టులను గుర్తించి అభివృద్ధి చేయాలని ఆయా శాఖల అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. స్టేట్ హెల్త్ కేర్ పాలసీతో మెడికల్ టూరిజంను లింక్ చేయాలని సూచనలు చేశారు. ఇదే తరహాలో వివిధ పాలసీలను ఆయా ప్రాజెక్టులకు అనుసంధానించాలన్నారు. మరోవైపు సీఎం అధ్యక్షతన విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులు ముఖ్యమంత్రికి ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన సీఎం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సమగ్రమైన యాక్షన్ ప్లాన్ తయారు చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఖ

# పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు

**సత్యసాయి మహాసమాధి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించండి**

**-సత్యసాయిబాబా శత జయంతి వేడులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

అమరావతి, నవంబర్ 10 : శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయండి

సత్యసాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

10 రోజులు 682 రైళ్లు

పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పారిశుద్ధ్యం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. జయంతి వేడుకల నేపథ్యంలో 65 ప్రత్యేక రైళ్లతో పాటు ఈనెల 13వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 682 రైళ్లు పుట్టపర్తికి రైల్వే శాఖ నడుతోందని వివరించారు. పుట్టపర్తి బస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కు రోజుకు 20 బస్సులు భక్తుల రవాణా కోసం ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ విజయం హైదరాబాద్ సమగ్ర, సమానాభివృద్ధికి సోపానం

**జవహర్ బాల్ మంచ్- చైర్మన్ మామిడి రిషికేష్ రెడ్డి**



**హైదరాబాద్ నవంబర్ 10 ప్రజాబలం ప్రతినిధి:**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ గారి విజయం, జూబ్లీహిల్స్ మరియు హైదరాబాద్ రెండింటి సమగ్ర, సమానాభివృద్ధికి కొత్త దశను ఆరంభిస్తుంది అని జవహర్ బాల్ మంచ్- చైర్మన్ మామిడి రిషికేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దీనిని కాంగ్రెస్ పార్టీ ధృడం గా నమ్ముతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతాయి.యువ, చురుకైన నాయకుడైన నవీన్ యాదవ్ యువత ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తూ, ఆధునిక తరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, అలాగే బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన విషయాన్ని మరోసారి నిరూపించిందన్నారు.సమాజ సేవ పట్ల నవీన్ యాదవ్ గారి కృషి, ఆయన నిరంతర సేవా కార్యక్రమాలు మరియు దాతృత్వం ఆయనను ఇతర అభ్యర్థుల కంటే ప్రత్యేకంగా నిలబెడతాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఈ ఉప ఎన్నికలో విజయంపై పూర్తి నమ్మకం కలిగి ఉంది. ఈ విజయం పార్టీకి మరింత ఉత్సాహాన్ని, ప్రజల ప్రభుత్వానికి కొత్త శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపి, సమగ్ర మరియు సమానాభివృద్ధి పయనంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసారు.

## నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న వినియోగదారుల సమాఖ్య

**సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి**




**హైదరాబాద్ నవంబర్ 10ప్రజాబలం ప్రతినిధి::** వివిధ దశలలో వినియోగదారులలో చైతన్యం పెంచేందుకు భారత వినియోగదారుల సమాఖ్య (సిసిఐ) నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నదని, దీనిలో భాగంగా సిసిఐ జోనల్, జిల్లా స్థాయిల్లో విస్తరణ చేస్తున్నదని సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రెడ్ క్రాస్ భవన్ లో సీసీఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినియోగదారుల పక్షాన నిలబడి వారికి అండగా రూపొందించబడిన చట్టాలు బ్యూరోక్రాట్లు, వ్యాపార ఉత్పత్తిదారుల అజమాయిషితో నీరుగారిపోతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులకు నాయకత్వం వహిస్తున్న సిసిఐ చట్టాల రూపకల్పనలో కీలక భూమిక నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాజధాని వరకు వివిధ స్థాయిలో ఉన్న వినియోగదారుల సమస్యలను గుర్తించి వారి పక్షాన పోరాడుతున్న క్రమంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మరింత చేయూతనిచ్చేందుకు సీసీఐ జోనల్ ఇన్చార్జిల నియామకం చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు జోన్లను ఏర్పాటు చేసి సీనియర్ వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులను, సీసీఐకి రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో ఏర్పాటుచేసిన కమిటీలను సిసిఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమిరెడ్డి ప్రకటించారు. నెలాఖరుకల్లా జిల్లా స్థాయిలో సిసిఐ ప్రతినిధుల ఎంపిక పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో సిసిసి సెక్రటరీ జనరల్ మొగిలిచర్ల సుదర్శన్, సీసీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ హరిప్రియ రెడ్డి, సీసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుప్రభ హత్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, రావుల రంజిత్ కుమార్, సందు ప్రవీణ్, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి , ప్రవీణ, రంగన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ జోనల్ ఇన్చార్జులు వీరే...

ఆదిలాబాద్ జోనల్ ఇన్చార్జిగా మాజీద్, వరంగల్ జోనల్ ఇన్చార్జిగా బి శ్రవణ్ కుమార్, నల్గొండ జోనల్ ఇన్చార్జిగా ఎం .యశ్వంత్ కుమార్, హైదరాబాద్ జోనల్ ఇంచార్జ్ గా ఏవి రావు, మహబూబ్ నగర్ జోనల్ ఇన్చార్జిగా అనుదివ్య లను నియమించారు.



## కిడ్నీ మార్పిడి చికిత్స కు వెన్సో 51,000 ఆర్థిక సహాయం

**నంద్యాల నవంబర్10 ప్రజాబలం ప్రతినిధి:**:నంద్యాల జిల్లా, బనగానపల్లె నివాసి కమ్మర విగ్నేశ్ ఆచారి(23) ప్రతిభావంతుడైన విద్యార్థి. మెరిట్ కోటా ద్వారా ఉచిత ఇంజినీరింగ్ సీటును పొందాడు. అనతి కాలంలో తీవ్రమైన అనారోగ్యానికి గురైన అతనికి, వైద్య పరీక్షలలో, దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి తుదిదశలో ఉందని నిర్ధారించారు. గత రెండు సంవత్సరాలుగా విగ్నేష్ డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. వైద్యుల సూచన మేరకు అతనికి తక్షణమే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయవలసిన అవసరం ఉంది. అతని తాత గారు తన అవయవాన్ని దానం చేయడానికి ముందుకు వచ్చారు. అయితే, దాత మరియు రోగి రక్త సరిపోలిక సరిపోకపోవడంతో, కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో ప్లాస్మా ఎక్స్ఛేంజ్ పద్ధతిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ శస్త్రచికిత్స మరియు సంబంధిత వైద్య చికిత్సల మొత్తం అంచనా వ్యయం సుమారు ?40 లక్షలు. అందులో ?25 లక్షలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా భర్తీ అవుతుండగా, మిగిలిన 15 లక్షలు వారి కుటుంబం స్వయంగా సమకూర్చుకోవలసి ఉంది. శస్త్రచికిత్స ఈనెల రెండవ వారంలో జరగనుంది.చికిత్స నిమిత్తం డబ్బు సమకూర్చుకోవడానికి వారు తాము ఉంటున్న చిన్నపాటి ఇంటిని విక్రయించి 6 లక్షలు సమకూర్చుకున్నారు. వెల్డర్ గా పనిచేస్తున్న రోగి తండ్రి శివశంకరయ్య గారి సంపాదన అతి తక్కువ. తల్లి గృహిణి.ఈ నేపథ్యంలో విగ్నేష్ తండ్రి శివ శంకర ఆచారి స్థానిక నాయకుల ద్వారా వెన్సో ట్రస్ట్‌ను సంప్రదించి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కోరారు. వెన్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శివ శంకర ఆచారి కి 51,000 అందజేశారు.

## జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో టీఐసీఆర్‌పీ శిక్షణ ప్రారంభం డిపిఎం శ్రీనివాసులు

నంద్యాల, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఎన్‌ఎంఎస్ ఎ) కార్యక్రమం కింద, ఆర్వైయస్‌యస్?ఏపిసిఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో టీ?ఐసీఆర్‌పీలకు (బ్యాచ్?02) ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం నంద్యాల జిల్లాలో ప్రారంభమైంది. ఈ శిక్షణలో నందికొట్కూరు, కోయిలకుంట్ల, డోన్ డివిజన్‌ల నుండి 63 మంది పాల్గొంటున్నారు. బ్యాచ్?02 శిక్షణ నవంబర్ 10 నుండి 14 వరకు కొనసాగనుంది. శిక్షణ కార్యక్రమం మొదటి రోజున ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, మరియు టీ?ఐసీఆర్‌పీల బాధ్యతలపై సెషన్లు నిర్వహించారు. రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయ 9 సూత్రాలు, ఏ?గ్రేడ్ మరియు ఏటీఎం మోడల్స్, పీఎమ్‌డీఎస్/ఆర్డీఎస్, కిచెన్ గార్డెన్ వంటి అంశాలపై క్లాస్‌రూమ్ టీచింగ్‌తో పాటు ప్రాక్టికల్ సెషన్లు కూడా నిర్వహించబడతాయి. శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో మోడల్స్ అమలు, లీడ్ ఫార్మర్ల ఎంపిక, రైతులతో మోడల్స్ వేయించడం, మరియు ఐసీఆర్‌పీల మార్గదర్శక చర్యల ప్రణాళిక రూపొందించబడనుంది.×ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా టీ?ఐసీఆర్‌పీలు గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ మోడల్స్ అమలు చేసి, రైతుల మార్పుకు ప్రధాన కారకులుగా నిలుస్తారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు నైపుణ్యం కలిగిన క్యాడర్‌ను తయారు చేయడమే మా లక్ష్యమన్నారు. ఎస్‌హెచ్‌జీలు, వివోలు, ఎమ్ఎస్‌లు వంటి వేదికలను ఉపయోగించి గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసి, రైతులకు సంఘాల ద్వారా ఆర్థిక వనరులు అందేటట్లు చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిపిఎం, జిల్లా ఎన్‌ఎఫ్‌ఏలు సునంద, రామకృష్ణ, నరేంద్ర, కరీం భాష, డిటిటిలు, టీ?ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

# 1 టౌన్ సిఐ ని కలిసిన బీజేపి 1 పట్టణ అధ్యక్షులు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం)** ఖమ్మం 1 వ పట్టణ అధ్యక్షులు గడీల నరేష్ అధ్యక్షతన 1 వ పట్టణ సి ఐ ని కలిసి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు భారతీయ జనతా పార్టి జాతీయ ప్రధానకార్యదర్శి, కేంద్రం హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పైన వ్యక్తిగత దూషణలు మరియు వారి ఫోటో ని సామజిక మధ్యమాల లొ వాట్సప్ గ్రూప్ లలో పెట్టి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వారి ప్రతిష్ట కు భంగం కలిగించే విధంగా స్థానిక బైపాస్ రోడ్డు ఏరియా వేణుగోపాల్ నగర్ రోడ్డు నెంబర్ 1 లొ నివాసముంటున్న షేక్ మౌలాలి అను వ్యక్తి రెచ్చగొట్టే విధముగా పోస్టులు పెట్టినందున అతని పైన చట్టపరమైన చర్యలు తీసుకోవలసినదిగా సిఐ ని కోరటమైనది ఈ కార్యక్రమం లొ టౌన్ అధ్యక్షులు గడీల నరేష్ జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా జిల్లా నాయకులు మంద సరస్వతి పొట్టిమూతి జనార్దన్ బండారు శ్రీనివాస్ మండల నాయకులు పాలేపు రాము పొట్టిమూతి వాణి ఊరుకొండ ఖాదర్ మేడ సంపత్ బొల్లోజు మనోజ్ తదితరులు పాల్గొన్నారు



# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయం

## 163 ప్లాట్లకు బహిరంగ వేలం -17,18 తేదీల్లో నిర్వహణ
## రిజిస్ట్రేషన్ కు ఆఖరు తేదీ నవంబరు 15



హైదరాబాద్ , నవంబర్ 11: స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లే అవుట్లలో నివాస భవనాల నిర్మాణానికి అనువైన ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహూదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల్లోని 163 ఓపెన్ ప్లాట్లను నవంబర్ 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు.

అవుటర్ రింగ్ రోడ్ కు అతి చేరువలోని తొర్రూర్ ప్రాంతంలో 200 %-% నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న125 ప్లాట్లు, కుర్మల్ గూడ లో 200-300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లిలో 200 - 1000 గజాల్లోని 13 ప్లాట్లను విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎటువంటి వివాదాలు లేని, ఈ ప్లాట్లలో తమ అభిరుచులకు అనుగుణంగా ఇండ్లను నిర్మించుకోవచ్చని, ఈ లే అవుట్లలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కూడా పూర్తి అయ్యింది. ఈ ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మేనేజింగ్ డైరక్టర్ వివరించారు.

పెద్ద అంబర్ పేట్ లోని అవికా కన్వెన్షన్ లో నవంబరు 17,18 తేదీల్లో తొర్రూర్ ప్రాంతంలోని 125 ప్లాట్లకు, 18 వ తేదీ మధ్యాహ్నం నుంచి బహదూర్ పల్లి, కుర్మల్ గూడల్లోని ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎండి శ్రీ గౌతమ్ పేర్కొన్నారు.

తొర్రూర్ లో సందడి ...నచ్చిన ప్లాట్ ఎంపిక కోసం తరలి వస్తున్న ప్రజలు

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలపై అనేక మంది ఆసక్తి కనపరుస్తున్నారు. తొర్రూర్ లోని ప్రాజెక్టు సైట్ లోని ప్లాట్లను స్వయంగా చూసుకుని నచ్చిన ప్లాట్ల నెంబర్లను నోట్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల గురించి వాకబుచేస్తూ, ఇప్పటికే ఈ లే అవుట్ లో ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న వారితో మాట్లాడటం తోపాటు, ప్లాట్ల వాస్తును చూసుకుంటూ సందడి చేస్తున్నారు. తొర్రూర్ లే అవుట్ లో ఉన్న885 ప్లాట్లలో విడతల వారీగా ఇప్పటివరకు 517 ప్లాట్లను విక్రయించారు. మిగిలిన వాటిలో ప్రస్తుతం 125 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో గృహావసరాల భూములకున్న డిమాండ్ ఉండటంతో, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొనుగోలుదారులు ఆసక్తి కనపరుస్తున్నారు.

# సర్వజ్ఞ విద్యార్థికి జాతీయ స్థాయి కళాత్మక పోటీలలో అభినందన పురస్కారం




**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం)** ఖమ్మం పట్టణం వీడిఓస్ కాలనీ నందు గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని కీర్తి ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కళాత్మక పోటీలలో (%చీఫ్అశీఖ్రీ గావజవశ్రీ ాతీఅర్అఎ జశీఎజూవ్ఢ్అశీఅ అఅ చీవఎ ణవశ్రీప్త్రఅ%) పాల్గొని తన ప్రతిభను చాటుకుంది దేశం నలుమూలల నుండి వచ్చిన అనేకమంది ప్రతిభావంతుల మధ్య పోటీపడి, ఆమె తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు కీర్తి శివానిని ఆమెకు అభినందన పురస్కారం (%ాజూజూతీవఎఱ్అశీఅ ాఖ్ఱతీం%) అందజేసి ఘనంగా సన్మానించారు అనంతరం ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కీర్తి శివాని కేవలం పాఠశాలకే కాక, ఖమ్మం నగరానికి కూడా గర్వకారణంగా నిలిచింది. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడమే గొప్ప విషయం వేలమంది పోటీదారులలో నిలబడి అభినందన పురస్కారం గెలుచుకోవడం ఆమె కళా నైపుణ్యానికి అంకితభావానికి నిదర్శనం. చదువుతో పాటు ఇలాంటి కళాత్మక రంగాలలో కూడా మన విద్యార్థులు రాణించడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చింది కీర్తి శివానిని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను ప్రదర్శించాలి సర్వజ్ఞ పాఠశాల ఎల్లప్పుడూ విద్యార్థుల సృజనాత్మకతను వారి ప్రతిభను ప్రోత్సహిస్తుంది భవిష్యత్తులో కీర్తి శివాని మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని డైరెక్టర్ కీర్తి శివానిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ మరియు ఉపాధ్యాయులు కీర్తి శివానికి అభినంధనలు తెలియజేశారు

# సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి

## రోటరీ క్లబ్ సభ్యుడిగా కొనసాగుతున్నందుకు సంతోషంగా ఉంది
## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్



జగిత్యాల, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించేందుకు ఐఎంఏ హాలులో శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, రోటరీ క్లబ్, ఆపి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అండగా నిలిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 ఏళ్ల క్రితమే గుజరాత్ నుంచి ప్రత్యేక బృందాన్ని జగిత్యాలకు తీసుకువచ్చి సుమారు 250 మంది దివ్యాంగులకు నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు వెచ్చించి 55 ట్రై సైకిల్లు, క్యాలిపర్స్, జైపూర్ పుట్స్, ఆర్టిఫిషియల్ హాండ్స్ అందించడం జరిగిందన్నారు ఎంతోమంది మాజీ మంత్రులు సైతం పాల్గొని కార్యక్రమాలను చూసి అభినందించారన్నారు. ప్రభుత్వ సహకారంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిజామాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈరోజు ఐఎంఏ ఆధ్వర్యంలో దివ్యాంగులకు జైపూర్ ఫుట్స్ అందించేందుకు కొలతలు తీసుకుని కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో జగిత్యాల ఐఎంఏ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకోవడం హర్షనీయమన్నారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న ఈ సంస్థల్లో నేను ఇప్పటికీ సభ్యుడిగా కొనసాగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉన్న నాకు ఎంత సంతృప్తిగా ఉందో, సేవా కార్యక్రమాల్లో మేటిగా నిలుస్తున్న సంస్థల్లో సభ్యుడిగా ఉండటం అంతే సంతృప్తినిస్తోందన్నారు. 34 ఏళ్ల క్రితం మెట్పల్లి రోటరీ అధ్యక్షుడిగా తాను ప్రజలకు సేవలందించానని గుర్తు చేశారు. రోటరీ స్వచ్ఛంద సంస్థ అనేది అత్యంత ధనిక దేశంలో పేదవాళ్లకు సాయం చేసేందుకు పురుడు పోసుకుందని, అత్యంత పేదవాళ్లు ఉన్న భారతదేశంలో ఇలాంటి సంస్థలు ఇంకా రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం ద్వారానే అన్ని సాధ్యం కావని, ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగిత్యాలలో గతంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పార్క్ నిర్మాణంతోపాటు గొల్లపల్లి రోడ్డులో స్మశాన వాటిక, పాత బస్టాండ్ లో హైలాండ్ నిర్మించడం జరిగిందన్నారు. గత కొన్నేళ్లుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రోటరీకి నిధులు ఎక్కడి నుంచో రావని, తామే సమకూర్చుకుంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు అందించేందుకు ఈరోజు కొలతలు తీసుకోవడం జరుగుతోందని, త్వరలోనే వీరందరికీ కృత్రిమ పరికరాలు తయారు చేయించి అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘు చందర్, నిజామాబాద్ జగిత్యాల రోటరీ క్లబ్ సభ్యులు శ్యామ్ అగర్వాల్, మంచాల కృష్ణ,చారి, కొత్త ప్రతాప్, రాజు, ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ హేమంత్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుధీర్, మునిసిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, జగిత్యాల క్లబ్ కార్యదర్శి ముస్కు రామ్ గోపాల్ రెడ్డి, సిఐ కరుణాకర్, నాయకులు అనిల్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి


## ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

## తెలంగాణఆశావర్కర్స్‌యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి

జగిత్యాల, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జగిత్యాల జిల్లా 3వ మహాసభ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎల్జీ గార్డెన్ లో నిర్వహించారు. ఈ మహాసభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్మూరి లత అధ్యక్షతన జరిగింది.ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన పి.జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల పట్ల తీవ్రమైన వివక్షతను ప్రదర్శిస్తుందని విమర్శించారు కరోనాకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు కాపాడిన ఆశా వర్కర్లను డబ్ల్యూహెచ్ఓ సహా అనేక అంతర్జాతీయ సంస్థలు ఆశా వర్కర్ల సేవలను గుర్తించి గౌరవించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం సరైన గుర్తింపు గౌరవాన్ని కల్పించడం లేదని విమర్శించారు నిర్దిష్టమైన పనిగంటలు లేకుండానే వెట్టి చాకిరి చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళా శ్రామికులైన ఆశా వర్కర్ల శ్రమను కేంద్ర ప్రభుత్వం చులకనగా చూస్తుందని పేర్కొన్నారు ఆశా వర్కర్లు లేకపోతే గ్రామీణ ప్రాంత వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోతాయని తెలిపారు. ఆశా వర్కర్లకు పని కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 18 వేల రూపాయలు వేతనం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ధర్నాలు పోరాటాలు నిర్వహించకుండా పోలీసులు ఉపయోగించి నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని అరెస్టులు చేస్తూ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తుందని విమర్శించారు కార్మిక హక్కుల్ని అరించటంలో కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగించడంలో కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఒకే విధమైన వైఖరిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు ఇప్పటివరకు ఎందుకు జీవో విడుదల చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ చనిపోతే అంత్యక్రియలు ఖర్చు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని పేర్కొన్నారు. సిఐటియూ నిర్వహించిన పోరాటాల వల్లనే ఆశా వర్కర్లకు గుర్తింపు వచ్చిందని తెలిపారు. అసలు వేతనమే లేని స్థానంలో నుండి 9,900 వేతనం పొందేటువంటి స్థాయికి ఆశ వర్కర్లు వచ్చారంటే అందుకు సిఐటియూ పోరాటాలే కారణమని తెలిపారు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశా యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఇందూరి సులోచన, జిల్లా అధ్యక్షులు గా ఆర్మూరి లత, జిల్లా ప్రధాన కార్యదర్శి గా రాయికంటీ దివ్య, కోశాధికారిగా మెట్టు మమత, ఉపాధ్యక్షులు గా ప్రేమలత, సుగుణ, జ్యోతి,సహాయ కార్యదర్శులు గా రూప, యశోద,వనిత లతో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ జిల్లా మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, జిల్లా నాయకులు వి.వెంకటాచారి, కుంచం శంకర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.స్వప్న, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి మమత,నాయకులు దివ్య ,లక్ష్మి ,వసంత, సరస్వతి, విజయ రాణీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలోయ ప్రతిఘటన పోరాట స్ఫూర్తితో విప్లవ కారులు ఐక్యం కావాలి

## ు అరుణపతాక ఆవిష్కరణలో కామ్రేడ్ సిపిరెడ్డి 41 వ వర్ధంతి సభలో సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రబాకర్ పిలుపు.ు



నకిరేకల్ నవంబర్ 10 నేటి విప్లవ పరిస్థితులకు తగినట్లు భారత విప్లవానికి కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి రూపొందించి, ఆచరించిన గోదావరిలోయ ప్రతిఘటన పోరాటం మాత్రమే దిక్సుచికగా నిలిస్తుందని గ్రహించి, విప్లవ కారులందరు ఒకే సిపిఐ(ఎం.ఎల్) పార్టీ నిర్మాణం కింద ఐక్యం కావాలని వివిధ ఎం.ఎల్ గ్రూపులకు సిపిఐ(ఎం.ఎల్) కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రబాకర్ పిలుపునిచ్చారు. నకిరేకల్ టౌన్, గుడిపాటి ఫంక్షన్ హాల్ లో సిపిరెడ్డి 41 వర్ధంతి సభ తెలంగాణ రైతు-కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం సైదులు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి బుద్ద సత్యనారాయణ, ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.నర్సన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుదాకర్, పీఓడబ్ల్యూ(విముక్తి) సంపంగి పద్మ, వెలుగు వనిత, పి.సునీత, తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కొలిమి ప్రసాద్, పి.డి.ఎస్.యు.(ప్రభంజనం) దుబ్బ మదు, పివైఎల్ బానోత్ సంతోష్ నాయక్, బీసిపి లింగన్న, భహుజన మహాసభ చిట్టిపల్లి కాషిరాం మరియు పోత సునీత తదితరులు ఈసభలో పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు అమరవీరుల అరుణపతాకాన్ని పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రబాకర్ ఆవిష్కరించారు. ఈసభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఇనుప సురేష్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కళారూపాలు సభికులను ఆకట్టుకున్నాయి.

# లంబాడీల వనభోజనం మహోత్సవ కార్యక్రమం విజయవంతం








**ఖమ్మం (ప్రజాబలం బ్యూరో)** ఖమ్మం రఘునాధపాలెం ఆర్ జి బి మామిడి తోటలో ఆదివారం లంబాడి కులా ఉద్యోగ , ఉపాధ్యాయ , రాజకీయ , వ్యాపార వర్గాలకు చెందిన వేలాడి కుటుంబాలు ఏకమై కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా సాంప్రదాయ , సాంస్కృతిక పద్ధతిలో ఘనంగా జరుపుకున్నారు . మర్చిపోతున్న లంబాడీల వేసా, భాష , సంప్రదాయలను ఈతరం పిల్లలకు అర్థమయ్యేలా కట్టుబాట్లను నేర్పించి ఉన్నత చదువులు చదివించి దేశానికి సమాజానికి ఉపయోగపడేలా చూడాలి అన్నారు . రాజకీయ రంగంలో సైతం ఐక్యమత్యంగా ఉండి రాజాధికారం దిశగా అడుగులు వేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో కన్వీనర్ పోరిక రాములు నాయక్ , కో కన్వీనర్ భూక్య మంగ్యా నాయక్ , ట్రెజరర్ మంగిలాల్ జాదవ్ , ప్రముఖులు మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి , హరిప్రియ నాయక్ , ఖమ్మం మాజీ మేయర్ పాపాలాల్ , టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్ , కుల సంఘం నాయకులు రాజకుమార్ జాదవ్ బిక్షపతి రాథోడ్ బాల్ సింగ్ రమేష్ కిషన్ నాయక్ దశరధి నాయక్ చక్రవర్తి హదిరామ్ పాపాలాల్ రామారావు బన్సీ లాల్ సీతారాం దేవా సింగ్ నాగు దాసు గౌతమి జ్యోతి ఇందిరా తదితరులు పాల్గొన్నారు

# ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించేంత వరకూ విస్తృత పోరాటాలు

## 15న చలో అచ్చంపేట
## 23న గుంజేడులో 30న బొగ్గుట్ట, డిసెంబర్ 4న చిరుమళ్ళలో సన్నాహక సభలు
## 9న ఆసీఫాబాద్ కు ఆదివాసీలు లక్షలాదిగా తరలిరావాలి
## ఆదివాసి 9 తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ వెల్లడి




**ఖమ్మం (ప్రజాబలం బ్యూరో)** ఎస్టీ జాబితా నురి వలస లంబాడీలను తొలగించడమే లక్ష్యంగా విస్తృత ఉద్యమాలు నిర్వహించనున్నట్లు ఆదివాసి 9 తెగల కార్యచరణ సమితి చైర్మన్ చుంచు రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం బల్లేపల్లి లోని జేఏసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించేంతవరకు జేఏసీ జెండా, ఎజెండా ఒకటేనన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15న చలో అచ్చంపేట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెంచు తెగల సహకారంతో ర్యాలీ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈ నెల 23న మహబూబాబాద్ జిల్లా గుంజేడులో, 30న ఇల్లందు బొగ్గుట్టలో, డిసెంబర్ 4న చిరుమళ్ళలో విస్తృత సన్నాహక సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9న ఆసిఫాబాదులో జరిగే బహిరంగ సభకు రాజకీయాలకతీతంగా ఆదివాసీలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... మైదాన ప్రాంత సమాజాన్ని పక్కదోవ పట్టించేందుకు పలువురు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. లంబాడీల కుట్రలను తిప్పికొడతామన్నారు. అనంతరం చలో అచ్చంపేట, బొగ్గుట్ట, చిరుమళ్ళ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆధార్ సొసైటీ అధ్యక్షులు కల్తీ వీరమల్లు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక విజయ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధ బోయిన లక్ష్మీనారాయణ ఆదివాసి మహిళా చైతన్య శక్తి చైర్మన్ పూసం వెంకటలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు కురసం పద్మజ, ఆర్టిఐ డేటా కమిటీ చైర్మన్ బట్టు వెంకటేశ్వర్లు, నల్లమల్ల చెంచుల ప్రతినిధి కాట్రాజు శ్రీను, జేఏసీ నాయకులు కుర్సం సీతారాములు, ముక్తి భాస్కరరావు, చిగుర్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# భౌతిక కాయానికి నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్ గింజల నర్సిరెడ్డి



**ఇల్లందు ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం)** కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ సునీత అత్త మరియు మండల కాంగ్రెస్ నాయకులు బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ తల్లి గారైన బొడ్డు సక్కుబాయి గారు (74) ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసిన కామేపల్లి మాజీ జెడ్పిటిసి జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల మల్లి బాబు యాదవ్ కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి గోవింద్రాల కు చేరుకొని మృతురాలి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇన్నాళ్లు పెద్ద దిక్కుగా ఉన్న ఆ కుటుంబానికి ఆమె లేని లోటు తీర్చలేనిదని విచార%శీ% వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ బాబు సింగ్, మాలోత్ సరిరాం నాయక్, మేకపోతుల మహేష్, సోమనబోయిన మల్లికార్జున్, తాజా మాజీ ఎంపీటీసీ గబ్రు నాయక్ బాదావత్ నాగరాజు చల్ల మల్లయ్య రాయబరపు కవి రాజు ఆలోత్ లక్ పతి వంగూరి శ్రీను ఇమామ్ మోహన్ వినోద్ రాజేష్ శంకర్ నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు

# రామడుగు వీరభద్రాచారికి ఘన సన్మానం



**ఖమ్మం ప్రతినిధి (ప్రజాబలం)** ఖమ్మం ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారిని విశ్వకర్మ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ డెవలప్మెంట్ సర్వీస్ ఖమ్మం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు కార్తిక వన సమారాధన చెరుకూరివారి మామిడి తోటలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారిని విద్యుత్ శాఖ ఖమ్మం ఎస్ ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి వేదాస్ అధ్యక్షులు చెన్నోజు పుల్లయ్య ప్రధాన కార్యదర్శి జయంతి శ్రీనివాస్ కోశాధికారి సున్నం వెంకట రమేష్ రాష్ట్ర సంఘం నాయకులు చిట్టోజు రమేష్ తోపాటు సంఘ సభ్యులు వీరభద్రాచారి ని శాలువా కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానం చేశారు పారంపర్య వైద్యులు రామడుగు వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రతి ఇరవై ఏడు రోజులకోసారి వచ్చే పుష్యమి నక్షత్రం రోజున ఒక సంవత్సరం నుండి పదహారు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు ఆయుర్వేద ఇమ్యూనిటి చుక్కలమందు రామభద్ర ఆయుర్వేద మూలికాయోగ పీఠం ఖమ్మం ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నట్లు దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారువిశ్వకర్మ పంచ వృత్తుల వారు యాంత్రికరణ దాటికి తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇది మంచిది కాదని, పంచ వృత్తుల వారికి మనోధైర్యం కల్పించేందుకు ఖమ్మం లోని వీడియోస్ కాలనీలో ఉన్న తమ నివాసంలోఉచితంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వీరభద్ర చారి పిలుపునిచ్చారు. ఆయుర్వేద మూలికాయోగ పీఠం చేస్తున్న ఉచిత సేవలకు గుర్తింపుగా ఘన సన్మానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు

# కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పగించొద్దు
## టిజీ ఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/కంది,సంగారెడ్డి మండలాలో వనకాలం వడ్ల కొనుగోలు కేంద్రాలను టిజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు,ప్రతి రైతు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు,కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అప్పగించోదని,తెలంగాణ ప్రభుత్వం వడ్లకు మద్దతు ధర ఇస్తుందని,ఏ గ్రేడ్ 2389, సాధారణ రకం గ్రేడ్ 2369, సన్నవడ్లకు 2389 బోనస్ 500, మొత్తం 2889 గా ఇస్తుంది,కావున ప్రతి ఒక్క రైతు వడ్ల కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని వారు అన్నారు,బోనస్ కు కావలసిన పత్రాలు, కొత్త పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డ్ ఉండాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,తాళ్లపల్లి మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ హాషం,లక్ష్మారెడ్డి, ప్రభుత్వ అధికారులతో పాటు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం ప్రమాదకరం
## పుల్కల్ ఎస్ఐ ఎన్, విశ్వజన్





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో, ఎస్ఐ ఎన్, విశ్వజన్, మాట్లాడుతూ, కొంతమంది రైతులు వరి ధాన్యాన్ని రహదారుల పైన ఆరబెట్టడం వలన, రోడ్డు ఎరుకుగా మారి, ప్రమాదాలు జరుగుతున్నాయని, అదేవిధంగా ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, బ్లాక్ పాలిథిన్ కవర్లతో కప్పడం వలన, రాత్రి వేళలో వాహనదారులు అవి గమనించక, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు, ఇప్పటికే కొన్ని చోట్ల ఈ విధంగా ఘటనలు చోటుచేసుకున్నాయని, పేర్కొన్నారు, రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వలన, ప్రజల ప్రాణాలకు ముప్పు అని అన్నారు, కావున రైతులు గ్రామపంచాయతీ ఆవరణాలు, ఖాళీ ప్రదేశాలు, లేదా రహదారులకు దూరంగా ఉన్న, సురక్షిత ప్రదేశాలను ఉపయోగించుకోవాలని, ఆయన విజ్ఞప్తి చేశారు, ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని, పుల్కల్ ఎస్ఐ ఎన్, విశ్వజన్, తెలిపారు

# క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ సభ్యుడిగా రమేష్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, కౌన్సిల్ సభ్యుడిగా, జోగిపేటకు చెందిన మెదిరే రమేష్,ను నియమిస్తూ, శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది, ఈయన జిల్లాలోని మెడికల్ అసోసియేషన్ లో, బాధ్యతలు నిర్వహిస్తున్నారు, రాష్ట్రంలో ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్లు, దయాగ్నస్టిక్ సెంటర్ లపై, నియంత్రణ కోసం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ను ఏర్పాటు చేసింది, ఈ కౌన్సిల్ ను వ్యవస్థీకరిస్తూ, వైద్య ఆరోగ్యశాఖ, తాజాగా జీవో నెంబర్,173, జారీ చేసింది, ఈ కౌన్సిల్ సభ్యులు,మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని, జీవోలో పేర్కొన్నారు, ఈ సందర్భంగా రమేష్, మాట్లాడుతూ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ సభ్యుడుగా, నియమించినందుకు, మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలియజేశారు, కౌన్సిల్ సభ్యుడిగా తన బాధ్యతలను, సక్రమంగా నిర్వహించి, కౌన్సిల్ కు మంచి పేరు వచ్చేలా కృషి చేస్తా మన్నారు.....

# 8512న నిర్వహించు ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
## ప్రజా ఉద్యమం కార్యక్రమం పోస్టర్లను విడుదల చేసిన వైసిపి నాయకులు.

తుగ్గలి: ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 12వ తేదీన నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ నందు మాజీ శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించు ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,వైసీపీ సేవాదళ్ జిల్లా నాయకులు తుగ్గలి మోహన్ రెడ్డి,మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డిలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి నందు ప్రతాపరెడ్డి నివాసం నందు ప్రజా ఉద్యమం కు సంబంధించి పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పేరుతో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని వారు తెలియజేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఈ ప్రజా ఉద్యమం ఆగదని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కావున 12న జరిగే ప్రజా ఉద్యమం కార్యక్రమానికి మండల పరిధిలోని గల వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి ఎంపీటీసీ రాజు,మాజీ సర్పంచ్ పురుషోత్తం,మామిళ్ళకుంట సత్యప్ప, అమినాబాద్ మాజీ సర్పంచ్ రామాంజనేయులు,బాట తాండ సర్పంచ్ గౌరవ సలహాదారుడు రాము నాయక్,గిరిగేట్ల విష్ణువర్ధన్ రెడ్డి తదితర మండల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాంట్ ఫోర్ట్ హై స్కూల్ ఖమ్మం విజేతలుగా నిలిచినా విద్యార్థులు
## అభినందించిన ప్రిన్సిపల్ బ్రదర్ జాన్ పాల్




**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం)** మాంట్ ఫోర్ట్ విద్యాసంస్థల మాలికల్ ఫెస్ట్ 2025 ను నల్గొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు . ఈ నిర్వహణలో పూణే ప్రావిన్సెస్ మరియు హైదరాబాద్ ప్రావిన్సెస్ లో గల 28 స్కూల్స్ పాల్గొనగా వివిధ విభాగాల పోటీలలో పాల్గొన్న మా మాంట్ ఫోర్ట్ హై స్కూల్ ఖమ్మం విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి , విశేష విజయాలు సాధించారు . తెలుగు వ్యాస రచన పోటీ విభాగంలో రెండవ స్థానం , వాద వివాదము మరియు చర్చ పోటీ విభాగంలో నాలుగువ స్థానం . పోస్టర్ తయారీ పోటీ విభాగంలో నాలుగువ స్థానంలో నిలిచారు . విజేతలుగా నిలిచినా విద్యార్థులు అభినందిస్తూ ఈ విజయాలు మా విద్యార్థులు కృషి ఉపాధ్యాయునిల సమర్థ మార్గదర్శకత వారి ప్రోత్సాహానికి ప్రతిఫలంగా నిలిచాయి . మా విద్యార్థులు ప్రతిభతో పాఠశాలకు గౌరవం తెచ్చారు . భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్ తెలిపారు

# రాజీ మార్గమే అత్యుత్తమ రాజ మార్గం

### ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్
### -మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శశిధర్ రెడ్డి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 10:**కాలాన్ని, ధనాన్ని వృథా చేసుకోవడం కంటే, సామరస్యం నిండిన రాజీ మార్గమే అత్యుత్తమ రాజీ మార్గమే రాజమార్గం అని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15 న తలపెట్టిన ప్రత్యేక లోక్ అదాలత్ను మందమర్రి సర్కిల్ పరిధిలోని పౌరులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రత్యేకంగా కోరారు.

లోక్ అదాలత్ అనేది కేసుల పరిష్కారానికి ఒక అద్భుతమైన వేదిక అని తెలిపారు. క్షణికావేశంలో నమోదు చేసుకున్న చిన్న చిన్న కేసులు, అలాగే కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి రాజీ పడుటకు అవకాశం ఉన్న కేసులను న్యాయస్థానం పరిధిలో స్వచ్ఛందంగా రాజీ కుదుర్చుకోవడం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియ ద్వారా న్యాయం తక్కువ సమయంలో లభించడమే కాకుండా, ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిరి, సంబంధాలు శాశ్వతంగా మెరుగుపడతాయన్నారు. న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ, ఖర్చు పూర్తిగా ఆదా అవుతుంది. ఈ మహత్తర అవకాశాన్ని మందమర్రి సర్కిల్ పరిధిలోగల మందమర్రి, రామకృష్ణాపూర్, కాశీపేట, దేవపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి కోరారు. ప్రజలు ఈ లోక్ అదాలత్‌లో పాల్గొని, తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకొని, న్యాయం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 10 :** 2025- 26 సంవత్సరానికి గాను వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)పి.చంద్రయ్య,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రైతు సంక్షేమం కోసం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతుల సౌకర్యం కొరకు కంట్రోల్ రూమ్ నం.6303928682 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 1967, 1800 4250 0333 నెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు అవసరమైన కొనుగోలు కేంద్రాల సమాచారం అందించడంతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని,సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు క్వార్టర్ ల కౌన్సిలింగ్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 10:**మందమర్రి ఏరియాలోని సి.ఈ.ఆర్ క్లబ్ లో సోమవారం సింగరేణి ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వాటర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ కు మందమర్రి మరియు శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాలకు 107 క్వాటర్స్ ప్రకటించగా,87 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, సీనియార్టీ ప్రకారం 18 మంది ఎన్.సి.డబ్ల్యూ.ఏ మందమర్రి మరియు శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియ ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ కేటాయించడం జరిగిందని, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశీ, మేనేజ్మెంట్ ట్రైని సివిల్ రాజు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికే సైన్స్ ఫెయిర్

కోరుట్ల, నవంబర్ 10: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఫెయిర్ దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు.సోమవారం కోరుట్ల పట్టణంలోని సాయి జీనియస్ హై స్కూల్ లో ఘనంగా సైన్స్ ఫెయిర్ (లెర్నర్స్ లీడ్ కాన్ఫరెన్స్ - 2025) నిర్వహించారు.ఈ సంధర్భంగావిద్యార్థులు సైన్స్, సోషల్,లాంగ్వేజ్ విభాగాల్లో సృజనాత్మక మోడళ్లను, ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభ,ఆవిష్కరణా తపన, ఆలోచనా శక్తి అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చౌకి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్, సోషల్ పట్ల ఆసక్తి పెంపొందించేం దుకు సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతో దోహదపడ తాయన్నారు. ఈ ఫెయిర్ ద్వారా పిల్లలు ప్రతిభను ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించే అవకాశాన్ని పొందారని చౌకి రమేష్ తెలిపారు. పిల్లలు రూపొందించిన ప్రయోగాలు సందర్శకుల ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శనల కు బహుమతులు ప్రదానం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 10 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమిని పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వంగా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి
## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ నవంబర్ 10 :** మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు.సోమ వారం జిల్లాలోని భీమారం మండలంలోని ఓ బి లు,వి ఓ ఎ.లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...అమ్మకు అక్షరామాల కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.ఉల్లాస్ కార్యక్రమం లో భాగంగా నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించుట కొరకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి ఉల్లాస్ ఆప్ లో నమోదు చేయడం జరిగిందని,నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమంను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఓ బి లు,వి ఓ ఎ లకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సి.ఆర్. పి.లచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని, అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి జిల్లాను అక్షరాస్యతలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం,జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్,ఏ పీ ఎం శ్రీనివాస్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల ఇబ్బందులను పట్టించుకోని ఆలయ అధికారులు.
## వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులకు అందించాల్సిన మొక్కులు, సేవలు, దర్శనాల విషయంలో దేవస్థానం అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని వేములవాడ బిజెపి పట్టణాధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం రోజున స్థానిక పద్మశాలి సంఘం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులు ముందుగానే మొక్కలు పెట్టుకొని వస్తున్న, టికెట్లు సరిపోవడం లేదని, జాగాలు అందుబాటులో లేవని చెప్పి భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఇది రాజన్న భక్తుల మనోభావాలను లెక్క చేయకపోవడం అని ఆయన మండిపడ్డారు. ఇటీవల పత్రికలలో, న్యూస్ ఛానల్ లో వచ్చిన కథనాలపై ఆలయ ఈవో స్పందించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. రాజన్న దేవాలయ ప్రతిష్టతను కాపాడాల్సిన అధికారులు ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని, భక్తుల్లో అయోమయం పెరుగుతుందని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా కార్తీక మాసం సందర్భంగా కళ్యాణ మొక్కులు, కోడె మొక్కులు, లింగార్చన మొక్కలు, పెట్టుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలు వస్తారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అట్టి భక్తులకు సరిపడా వసతులు, టికెట్ల వ్యవస్థ,క్రమబద్ధమైన దర్శనాలు ఏర్పాట్లు దేవస్థానం తప్పనిసరిగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధికి బిజెపి పార్టీ అడ్డంకి కాదు అని అభివృద్ధి పేరుతో భక్తులకు ఇబ్బందులు కలగకూడదు అని ఆయన అన్నారు. దేవస్థానం తీసుకున్న నిర్ణయాలపై అధికారులు బహిరంగంగా వివరణ ఇవ్వాలని రాపల్లి శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేకుల రాజకుమార్, వివేక్ రెడ్డి, నామాల శేఖర్, రేగుల శ్రీకాంత్, అన్నం నరసయ్య, డాక్టర్ వెంకన్న, సగ్గు రాహుల్, మామిళ్ళ లక్ష్మీరాజ్యం, బిల్లా కృష్ణ హరి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతుల్లోనే దేశ బంగారు భవిష్యత్తు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సాయికి ఘన సన్మానం.

## వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ రూరల్ మండలం నమిలి గుండుపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం కుమారుడు వంగపల్లి మని సాయి వర్మ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు అందుకున్నందుకు వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడిసె సదానందం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా సదానంద మాట్లాడుతూ సాయి వర్మ 2019బి2023 సంవత్సరంలో సిఎంఆర్ కాలేజీలో బీటెక్ చదువుతున్న సమయంలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ తరపున సమాజసేవ చేసినందుకు తెలంగాణ రాష్ట్రం తరపున అవార్డు తీసుకోవడం అభినందనీయమని, యువత చేతుల్లోనే దేశ బంగారు భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, విద్యాసాగర్ రావు, జనార్ధన్, సుధాకర్ రెడ్డి, అనిల్ కుమార్, నర్సింగరావు, గంగరాజు, గొంటి శంకర్, నరాల శ్రీనివాస్, అంజయ్య, మహేందర్, మనోహర్, శ్రీనివాస్, రాజశేఖర్, పార్లపల్లి అంజయ్య, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


# అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు





**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం నవంబర్ 10:** తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం లాఛనంగా నిర్వహించనున్నందున ఘట్కేసర్ లోని ఎంఎల్ఎ క్యాంపు ఆఫీస్ ప్రక్కన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందెశ్రీ అంత్యక్రియలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అన్నీ శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రముఖులు రావడానికి సరైన విధంగా రహదారి ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు నిర్వహించాలని అంతే కాకుండా ఎన్ఎఫ్ సి కాలనీలోని అందెశ్రీ ఇంటి వద్ద కూడా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. పోలీసు శాఖ వారు బందోబస్తు, ఆర్ అండ్ బి వారు కావలసిన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.


# 14 ఏళ్లుగా నివేశన స్థలాల కోసం ఎదురుచూస్తున్న ఆరేపల్లి గ్రామస్తులు.











:: 2 ::

Accordingly, the following notification shall be published in the Extraordinary issue of the Andhra Pradesh Gazette dated: 13-07-2009.

NOTIFICATION

"Under Para 5.1 of Chapter-V of Andhra Pradesh Resettlement and Rehabilitation Policy, 2005 issued in G.O.Ms.No.68, Irrigation & C.A.D.(PW) Department, dated 08-04-2005, the Government of Andhra Pradesh hereby notify the village of Arepalli H/o Sankepalli, Vemulawada (M), Karimnagar District (172 houses) as fully submerged under Mid Manair Reservoir".

The District Collector / Joint Collector, Karimnagar shall take necessary action in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

ADITYA NATH DAS,
SECRETARY TO GOVERNMENT

To
The Commissioner of Stationery & Printing,
Government of Andhra Pradesh, Hyderabad -
and furnish (2) copies of Gazette to this Department.
The Commissioner (R&R), Irrigation & C.A.D.Department,
7th floor, Budda Bhavan, Ranigunj, Secunderabad-500 003.
The District Collector, Karimnagar.
The Joint Collector, Karimnagar.
The Chief Engineer (Projects), Irrigation, LMD Colony, Karimnagar.
The Special Collector (LA), Sriramsagar Project, Hyderabad.
The Commissioner of Land Administration, A.P., Hyderabad.
Copy to:
P.S. to Minister (M&MI).
Sf/SC

// FORWARDED :: BY ORDER //

SECTION OFFICER

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** మిడ్ మానేరు రిజర్వాయర్ (రాజరాజేశ్వరి) ముంపునకు గురి అయిన ఆరెపల్లి గ్రామానికి సంబంధించిన దాదాపుగా 600 ఎకరాల వ్యవసాయ భూమిని మిడ్ మానేరు రిజర్వాయర్ లో కోల్పోవడం జరిగింది. దీనితో ఆరెపల్లి గ్రామస్తులు ప్రస్తుతం వ్యవసాయ కూలీలుగా దీనస్థితికి మారడం జరిగింది. వారికి వ్యవసాయం చేసుకోవడానికి వ్యవసాయ భూమి లేదు, కూలికి పోతే తప్ప బ్రతుకుతెరువు లేదు. ఆరేపల్లి గ్రామస్తులు బ్రతకడం కష్టంగా మారింది. ముంపు గ్రామాల ప్రజల దీనస్థితిగతులు ఒక్కొక్క గ్రామానిది ఒక్కొక్క విధంగా ఉన్నాయి. ప్రభుత్వం జీవో నెంబర్ 68, 13/07/2009 సంవత్సరం రోజున ఆరేపల్లి గ్రామాన్ని పూర్తి ముంపు గ్రామంగా ప్రకటించి, 04/06/2011 రోజున 219 మందికి ఒక్కొక్కరికి 242 చదరపు గజాల చొప్పున ఆరెపల్లి గ్రామస్తులకు సంకపల్లి గ్రామపంచాయతీ శివారులో పట్టాలు ఇవ్వడం జరిగింది. 2013 సంవత్సరంలో సంకపల్లి శివారులోని సర్వే నెంబర్ 396 లో 12 సంవత్సరాల నుండి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఉంటున్నట్లుగా ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ కూడా కొంతమందికి భూ నిర్వాసితులకు ఇవ్వడం జరిగింది. కానీ అట్టి స్థలాన్ని మరొక ముంపు గ్రామమైన రుద్రవరం గ్రామస్తులకు నివేషణ స్థలం సరిపోక ఆరెపల్లి గ్రామస్తులకు కేటాయించిన పట్టాలను (నివేషణ స్థలాలను)రుద్రవరం గ్రామస్తులకు కేటాయించగా ప్రస్తుతం రుద్రవరం గ్రామస్తులు ఇండ్ల నిర్మాణం చేసుకొని అట్టి నివేషణ స్థలాలలో వారు నివసిస్తున్నారు. ఆరేపల్లి గ్రామస్తులకు మరొక చోట అనగా ఆర్ అండ్ ఆర్ కాలనీ చింతల్టన గ్రామంలో ఇస్తామని చెప్పి 219 మంది లబ్ధిదారులలో కేవలం 72 మందికి మాత్రమే ఇంటి నివేషణ స్థలాలు కేటాయించి నూతన పట్టాలు అందివ్వడం జరిగింది. మిగిలిన 150 మందికి గత 14 సంవత్సరాలుగా నీవేషణ స్థలాల పట్టాల కోసం ఆరేపల్లి గ్రామస్తులు ఎప్పుడు ప్రభుత్వ అధికారులు నివేశన స్థలాల పట్టాలు ఇస్తారోరని ఎదురుచూస్తున్నారు. స్థానిక తాసిల్దార్ కు, వేములవాడ ఆర్డీవోకు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు, స్థానిక శాసనసభ్యునికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడం విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది. ఏ ప్రభుత్వ అధికారి కూడా 14 సంవత్సరాల నుండి ఈ నివేషణ స్థలాల సమస్య పరిష్కారం చూపకుండా నేటి వరకు లబ్ధిదారులకు న్యాయం చేయడం లేదు అని ఆరేపల్లి గ్రామస్తులు తమ విస్మయాన్ని వ్యక్తపరుస్తున్నారు. రెండు ప్రభుత్వాలు మారిన తమ రాత మారలేదని ఆరేపల్లి వాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఆరేపల్లి గ్రామస్తులకు 150 మందికి ఇండ్ల స్థలాలు ఆర్ అండ్ ఆర్ కాలనీ చింతల్టన గ్రామంలో కేటాయించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బాల్యవివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన మేకల సమవ్వబిరమేష్ దంపతుల కూతురు వివాహం తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్బిరాజేశ్వరి దంపతుల కుమారుడితో వివాహం జరుగుతుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి పెళ్లికూతురు మైనర్ అంటూ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న అధికారులు వివాహం జరుగుతున్న ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి పెళ్లి కూతురు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించి, పెళ్లికూతురు మైనర్ గా తేల్చి వివాహం జరగకుండా ఫంక్షన్ హాల్ కు తాళం వేయించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రజని, సౌజన్య చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ స్రవంతి, వరుడు, వధువు కుటుంబ సభ్యులకు బాల్యవివాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

# ధాన్యం సేకరణ పై కలెక్టర్లతో మంత్రుల సమీక్ష

## ధాన్యం సేకరణ మరియు పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల మరియు సీఎస్ రామక్రిష్ణారావు

## సీసీఐ కొత్త నిబంధనలపై పత్తి రైతుల ఇబ్బందులను మంత్రి దృష్టికి తెచ్చిన జిల్లా కలెక్టర్లు.

## నవంబర్ నెల పంటల సేకరణకు కీలకం మంత్రి తుమ్మల

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి నవంబర్ 10:** ధాన్యం కొనుగోళ్లలో సమస్యలపై జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్, తుమ్మల మరియు సీఎస్ రామక్రిష్ణారావు సమీక్ష చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ల తో జరిగిన సమీక్షలో పత్తి మొక్కజొన్న సోయాచిక్కుడు కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు.
మొక్కజొన్న కొనుగోలులో ఎకరాకు 18.5 క్వింటాలు నుంచి 25 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచడం వల్ల





రైతులు సంతోషంగా ఉన్నారని జిల్లా కలెక్టర్లు మంత్రి తుమ్మలకు తెలిపారు.
పత్తి కొనుగోలులో ఎల్1 ఎల్2 నిబంధనలు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్లు మంత్రి తుమ్మలకి తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ఎకరాకు 7 క్వింటాలు పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని సీసీఐ నిబంధన ఎత్తివేసి 12 క్వింటాలు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని మంత్రి తుమ్మల తెలిపారు.
వర్షాలవల్ల రంగుమారిన సోయాచిక్కుడు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు జిల్లా కలెక్టర్లకు తెలిపారు, మంత్రి తుమ్మల. పంటల సేకరణకు ఈ నవంబర్ నెల కీలకమని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

# ఆత్మ కమిటీ డైరెక్టర్ ఖలీద్ జన్మదిన వేడుకలు

## మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు.




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 10 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: జోగిపేట లోఆత్మ కమిటీ డైరెక్టర్ ఖలేద్ జన్మదిన వేడుకను జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు,కేక్ కట్ చేయించి, ఖలేద్కు శాలువాతో మరియు పూలమాలలతో సన్మానం చేసి,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దకూరి శంకర్, మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్ ,ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్యాల మధు, దాకూరి వెంకటేశం , అల్లే శ్రీకాంత్ , మార్క్ ఫైడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి , మాజీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు ఖలేద్కు, మరిన్ని విజయాలు సాధించాలనిఆకాంక్షించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com